

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	240	270
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.155	215	240

ఉష్ణోగ్రత గరిష్ఠం 41.0 । కనిష్ఠం 25.4

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం

- యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రం
- సమీపంలోనే బస్వాపూర్ రిజర్వాయర్
- సామాజిక ఉద్యమానికి నాంది పలికిన భూదాన్‌పోచంపల్లి
- సెలవుల్లో వినోదంతోపాటు విజ్ఞానాన్ని అందిస్తున్న ప్రాంతాలు



భూదాన్‌పోచంపల్లిలో ఆకట్టుకుంటున్న పచ్చనిపైర్లు

నృసింహ క్షేత్రం

ప్రపంచ ఆధ్యాత్మిక క్షేత్రం.. ప్రపంచ పర్యాటక ప్రాంతం.. జైనులు కొలువుదీరిన నెలవు.. ఆసియా ఖండంలోనే మొట్టమొదటి ఏకశిలా ఖిల్లా.. ఇవన్నీ కలగలిపితే యాదాద్రి భువనగిరి జిల్లా. ప్రపంచ పటంలో ఇంత గొప్ప చరిత్రగల జిల్లాను సందర్శించేందుకు దేశంలోని వివిధ రాష్ట్రాల పర్యాటకులతోపాటు ప్రపంచ పర్యాటకులు సైతం ఆసక్తి చూపుతుంటారు. వేసవి సెలవులు రావడంతో పర్యాటకుల సందడి పెరుగుతోంది. దీంతో జిల్లా టూరిస్ట్ హబ్‌గా మారింది. (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

4

ఎండ నుంచి ఉపశమనం



భానుడి ప్రతాపం రోజురోజుకూ పెరిగిపోతోంది. వేడిగాలులకు తోడు ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇక వాహనదారుల పరిస్థితి వర్ణనాతీతం. రోడ్డువెంట వెళుతుంటే నిప్పుల కొలిమినుంచి వెళుతున్న భావన కలుగుతోంది. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మునిసిపాలిటీ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాకేంద్రంలోని ఎన్జీ కళాశాల వద్ద షేడ్‌నెట్ ఏర్పాటు చేశారు. (ఆంధ్రజ్యోతి-రామగిరి)

ఉమ్మడి జిల్లా ఉష్ణోగ్రతలు గురువారం

	గరిష్ఠం
దామరచర్ల మండలం	
తిమ్మాపూర్	44.9
వేములపల్లి మండలం	
బుగ్గబావిగూడ	44.7
త్రిపురారం మండలం	
మాటూరు	44.6
మాడ్గులపల్లి	44.5
అనుముల	44.4
కట్టంగూరు	44.0
చిట్యాల	44.0
మిర్యాలగూడ	44.0
తిప్పర్తి మండలం	
పజ్జూరు	43.7
కేతేపల్లి	43.6
చండూరు	43.6
తిరుమలగిరి(సాగర్)	43.4
దామరచర్ల	43.2
తుంగతుర్తి	43.2
సంస్థాన్‌నారాయణపురం	42.8
గుండాల	42.6
రామన్నపేట	42.5
తుంగతుర్తి	43.2



పంటల బీమాకు
సన్నాహాలు

- ప్రతిపాదనలు రూపొందించాలని ప్రభుత్వం ఆదేశం
- వరి, పత్తి పంటలకే బీమాపై నివేదిక ఇచ్చే అవకాశం
- త్వరలో విధివిధానాలు ఖరారయ్యే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో 21.50లక్షల ఎకరాల్లో పంటల సాగు

నల్లగొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పంటల ఉచిత బీమా పథకం అమలుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏ పంటలకు బీమా వర్తింపజేయాలో నివేదిక ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

గత వానాకాలం సీజన్ నుంచే పంటల బీమా పథకం అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా, యాసంగి సీజన్ ముగిసినా ఈ పథకం అమలుకు నోచుకోలేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వచ్చే వానాకాలం నుంచి పంటల ఉచిత బీమా పథకం అమలు చేసేందుకు నిర్ణయించింది. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పీఎంఎఫ్‌బీవై పథకంలో చేరడంతో పాటు పంటల బీమా కోసం రైతుల వాటా ప్రీమియం కూడా చెల్లించేందుకు నిర్ణయించింది. అందుకు విధివిధానాలు రూపొందించాలని మిగతా 5వ పేజీలో...

బీమాకు ఎకరం యూనిట్‌గా తీసుకోవాలి • 5లో..

సిమెంట్, ఐరన్
ధరలు పైపైకి



- సిమెంట్ బస్తాపై నెల రోజుల్లో రూ.70 వరకు పెరుగుదల
- మే చివర నాటికి మరో రూ.20 పెరిగే అవకాశం
- అదే బాటలో ఐరన్
- నెల రోజుల్లో టన్నుకు రూ.6వేలు పెరిగిన ధర
- నిర్మాణదారులపై అదనపు భారం రూ.14.40కోట్లు

సొంతింటి కల నెరవేర్చుకోవాలని ప్రతీ ఒక్కరికి ఆశ ఉంటుంది. ఆ కల నెరవేర్చుకునేందుకు అహర్నిశలూ కష్టపడుతుంటారు. కొంత పొదుపు చేసి, మరికొంత బ్యాంకు నుంచి రుణం తీసుకుని ఆ కలను నెరవేర్చుకుంటారు. కాలంతోపాటు వ్యక్తి ఆలోచనలో మార్పు, ప్రపంచీకరణ నేపథ్యంలో పెరుగుతున్న ఆదాయంతో కొత్త ఇంటి నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే పెరుగుతున్న సిమెంట్, ఐరన్ ధరలు వారి ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి. ధరల కారణంగా సొంతింటి కల సాకారమయ్యే పరిస్థితులు కనిపించడం లేదని గృహ నిర్మాణదారులు వాపోతున్నారు.

• ఆంధ్రజ్యోతి, కోదాడ

నెలరోజుల వ్యవధిలో అన్ని కంపెనీల సిమెంట్ ధరలు రూ.50 నుంచి రూ.70 వరకు పెరిగాయి. వచ్చే నెల చివరి నాటికి మరో రూ.20 పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. మార్చి నెలలో బ్రాండెడ్ కంపెనీ సిమెంట్ ధర బస్తా రూ.277 ఉండగా, ఈ నెల మొదటి వారం వచ్చే సరికి రూ.327కి పెరిగింది. ఈ నెల 23న రాత్రి మరో రూ.10 పెరిగి రూ.337కి చేరింది. ఈ నెలలో ఒక్కో బస్తాపై రూ.50 మేర ధర పెరిగింది. మే



చివర నాటికి బస్తా ధర మరో రూ.20 పెరిగి రూ.357కి చేరుతుందని వ్యాపారులు చెబుతున్నారు. చిన్న కంపెనీల సిమెంట్ ధర సైతం బస్తా రూ.50 మేర పెరిగింది. ఐరన్ నెల క్రితం టన్ను ధర రూ.55వేలు ఉండగా, ప్రస్తుతం రూ.60వేలకు పెరిగింది. టన్నుకు రూ.5వేల మేర ధర పెరిగింది. వీటితోపాటు కలర్స్, ఇతర సామ గ్రి ధరలు కూడా పెరిగాయి. రెండు నెలల క్రితం వరకు స్క్వేర్ ఫీట్ నిర్మాణానికి రూ.1,700 వ్య యం కాగా, నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో రూ.2,000కు ఖర్చు పెరిగిందని మేస్త్రీలు చెబుతున్నారు. ఒక్కో స్క్వేర్‌ఫీట్‌పై రూ.300 అదనపు భారం పడుతోంది. 200 గజాల్లో డబుల్‌బెడ్‌రూం ఇంటి నిర్మాణానికి 800 బస్తాల సిమెంట్ వినియోగం అవుతుంది. సిమెంట్ బస్తా ధర రూ.60 పెరగడంతో రూ.48,000 అదనపు భారం పడుతోంది. అదే విధంగా నాలుగు టన్నుల ఐరన్ వినియోగం అవుతుండగా, టన్ను ధర రూ.5,000 పెరగడంతో, మరో రూ.20,000 అదనపు భారం పడుతోంది. రెండింటిపైనే రూ.68,000 అదనపు వ్యయం అవుతోంది. మే నాటికి ధరల పెరుగుదల భారం రూ.లక్ష వరకు ఉంటుందని అంచనా. ఈ క్రమంలో కొత్త ఇంటి నిర్మాణం కలే అని గృహ నిర్మాణదారులు వాపోతున్నారు. ఇదిలా ఉంటే గత ఏడాది సిమెంట్ పరిశ్రమలకు ఆశాజనంగా లేకపోగా, ప్రస్తుతం ధరల పెరుగుదలతో వాటికి ఆదాయం పెరగనుంది.

రూ.14.40కోట్ల అదనపు భారం

ఉమ్మడి జిల్లాలో చిన్న, పెద్ద సిమెంట్ కంపెనీలు సుమారు 26 వరకు ఉన్నాయి. వాటి ద్వారా నెలకు సుమారు మిగతా 4వ పేజీలో...

'భూభారతి'తో సమస్యల పరిష్కారం : కలెక్టర్

నాంపల్లి, గట్టుప్పల్, మునుగోడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భూ భారతితో రైతుల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం నాంపల్లి, గట్టుప్పల్, మునుగోడు మండల కేంద్రాల్లో నిర్వహించిన 'భూభారతి' అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ధరణిలో గుర్తించిన లోపాలన్నింటినీ భూభారతి ద్వారా సరిచేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. జూన్ 2 నుంచి భూ ఈ చట్టం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. రైతులు భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అందుకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ధరణిలో వీఆర్వో వ్యవస్థను తీసివేయడంతో ఇబ్బందులు ఏర్పడగా, రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రతీ గ్రామానికి ఒక గ్రామ పాలనాధికారిని నియమించనున్నదని తెలిపారు. జిల్లాలో 33 మండలాలకు 12మంది సర్వేయర్లు మాత్రమే ఉన్నారని, ఈ సమస్యను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వమే లైసెన్స్ సర్వేయర్లను నియమించనుందని తెలిపారు. సాదా బైనామా, ఇతర సమస్యలు పరిష్కరించేందుకు గతంలో సీసీఎల్ఏకు అవకాశం ఉండేదని, భూభారతిలో ఆర్డీవోకు అవకాశం కల్పించారన్నారు. అలాగే తప్పులు సరిచేసే అవకాశం 90 శాతం తహసీల్దార్ స్థాయిలో ఉంటుందన్నారు. రైతులకు రుణాలు అవసరమైతే బ్యాంకులో భూమి కాగితాలు, ఇతర డాక్యుమెంట్లు సమర్పించాల్సిన అవసరం లేదని, భూభారతి పోర్టల్ వివరాల ఆధారంగా రుణం ఇస్తాయన్నారు. రైతుల భూములను సర్వే చేయించి హద్దులు నిర్ణయించి మ్యాప్‌తో సహా రిజిస్ట్రేషన్ సమయంలో ఇస్తామన్నారు. దీంతో భూ కబ్జాలకు అవకాశం ఉండదన్నారు. ప్రతీ పౌరుడికి ఆధార్‌కార్డు ఉన్నట్లు రైతులకు భూదార్‌కార్డు ఇస్తామన్నారు. భూముల వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చన్నారు. కొత్త చట్టంలో అనుభవదారుడికి హక్కు కల్పించే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్సీ నెల్లకంటి సత్యం మాట్లాడుతూ, భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తెచ్చిన భూభారతి చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో అధిక భాగం ఫ్లోరైడ్ పీడిత ప్రభావిత ప్రాంతంగా పేరున్న మునుగోడు ప్రాంతంలో ప్రజలకు అన్నిరకాలుగా జీవనధారమైన వాగులు అక్రమణలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. నాంపల్లి మండలానికి ఒక ఆర్ఐను నియమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివా‌స్‌రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, ఫ్లోరోసిస్ ఉద్యమ నేత కంచకుంట్ల సుభాష్, మండల ప్రత్యేక అధికారులు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, బీరప్ప, తహసీల్దార్లు దేవా సింగ్, కే.రాములు, నరేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారయణయాదవ్, ఎంపీడీవోలు రామకృష్ణశర్మ, జూలకంటి మాధవరెడ్డి, శాంతికుమారి, మండల వైద్యాధికారి డాక్టర్ భవాని, ఏవో శివ, నాయబ్ తహసీల్దార్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.



గట్టుప్పల్‌లో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మూడు గంటల ఉక్కపోత.. రోగుల అవస్థలు

జిల్లా కేంద్రాస్పత్రిలో నిలిచిన విద్యుత్ సరఫరా ● మొరాయించిన జనరేటర్

నల్లగొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ఆస్పత్రిలో గురువారం రాత్రి అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయి మూడు గంటల పాటు ఆస్పత్రిలోని రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదే సమయంలో జనరేటర్ సైతం మొరాయించటంతో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగింది. మరమ్మతు అనంతరం జనరేటర్ పనిచేసినా ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో ఫ్యాన్లు, లైట్లు పనిచేయలేదు. గురువారం రాత్రి ఏడు గంటల నుంచి 10 గంటల వరకు ఆసుపత్రి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌లో ట్రిప్ అవడంతో విద్యుత్ అంతరాయం అయినట్లు తెలిసింది. దీంతో వివిధ విభాగాల్లో విద్యుత్ సరఫరా కాక సమస్యలు ఎదురయ్యాయి. గతంలో సైతం పలుమార్లు విద్యుత్ సరఫరా కాక ఇలాంటి పరిస్థితులు ఏర్పడినా ఆసుపత్రి అధికారులు నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. అత్యవసర సర్వీసుల్లో భాగంగా ఒక్కోసారి శస్త్రచికిత్సలు చేయాల్సి ఉంటుంది. గురువారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఆక్సిజన్ సరఫరాకు కూడా సమస్యలు ఎదురయ్యాయని సమాచారం. ఈ ఆస్పత్రి ప్రాంగణంలోనే ప్రసూతి విభాగం ఉంది. నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి జిల్లా నలుమూలల నుంచి, కొన్నిసార్లు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అత్యవసర వైద్య సేవల కోసం వివిధ సమస్యలతో నల్లగొండలోని ప్రభుత్వ ఆసుపత్రికి వస్తుంటారు. ఇంత పెద్ద ఆస్పత్రికి తరచుగా విద్యుత్ సరఫరా కాకుండా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. గురువారం నల్లగొండ జిల్లాలో 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఎండలకు, ఉక్కపోతకు తోడు రాత్రి సమయంలో కరెంటు సరఫరా నిలిచిపోవడంతో ఫ్యాన్లు పనిచేయక రోగులతో పాటు, వారి బంధువులు సైతం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బర్నింగ్ వార్డులతోపాటు, చిన్నారులు కరెంటు సరఫరా లేకపోవడంతో సతమతమయ్యారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయి రోగులు అవస్థలు పడిన అంశంపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా అధికారులు అందుబాటులోకి రాలేదు.



జిల్లా కేంద్రంలోని కేంద్రాసుపత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సెల్ ఫోన్ లైట్లతో తిరుగుతున్న రోగులు

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్ కేసులు లేకుండా త్వరితగతిన పరిష్కరించి కేసుల సంఖ్యను తగ్గించాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ అధికారులతో నిర్వహించిన నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకొని పూర్తి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ దాఖలు వరకు జాగ్రత్తగా పరిశోధన చేయాలన్నారు. ఫోక్సో కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ మౌనిక, అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీ శివరాంరెడ్డి, రాజశేఖర్‌రాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

కానిస్టేబుళ్లకు పదోన్నతి

ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో పనిచేస్తున్న ఏడుగురు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో వారికి పట్టీలు అందజేసి ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, అడ్మిన్ ఆర్ఐ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మోరు తల్లిగా రేణుకా ఎల్లమ్మ

కనగల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దర్వేశిపురం శ్రీరేణుకా ఎల్లమ్మ గురువారం అమ్మోరు తల్లిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి వేప, మామిడి ఆకులతో విశేష అలంకరణ చేసి సహస్రనామాలతో కుంకుమ పూజలు నిర్వహించారు. పంచనాగ, సింహ హారతులిచ్చారు. ప్రత్యేక పూజలు అర్చకుడు మాల్లాచారి ఆధ్వర్యంలో కొనసాగాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. కుంకుమ అభిషేక పూజలు చేయించి చీర సారె, ఒడిబియ్యం బోనాన్ని నైవేద్యంగా సమర్పించారు.



సమాచారం

డీవైఎస్‌వో ఆధ్వర్యంలో అర్బన్

వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు

నల్లగొండ స్పోర్ట్స్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా యువజన, క్రీడల శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ నుంచి నల్లగొండ, మిర్యాలగూడ పట్టణాల్లో అర్బన్ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో కుంభం నర్సిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్, మేకల అభినవ్ స్టేడియంలో బాక్సింగ్, మిర్యాలగూడలోని ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్, అవుట్‌డోర్ స్టేడియంలో బాక్సింగ్ క్రీడా వేసవి శిక్షణ శిబిరాలను నెల రోజుల పాటు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఎనిమిది నుంచి 19 సంవత్సరాల వయస్సు బాల,బాలికలు అర్హులన్నారు. బాల, బాలికలు క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 9440072854 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి

కళారంగంలో విద్యార్థులకు శిక్షణ

నల్లగొండ కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా బాలభవన్, నాగార్జునసాగర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బోయవాడ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నేటి నుంచి జూన్ 5వ తేదీ వరకు కళారంగంపై వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఈవో బొల్లారం భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. బాల, బాలికల్లో సృజనాత్మక శక్తిని వెలికితీసే ఉద్దేశంతో కళారంగంపై అవగాహన పెంచాలనే సంకల్పంతో బాల,బాలికలకు చిత్రలేఖనం, కుట్లు అల్లికలు, శాస్త్రీయ నృత్యం, బ్యూటీషియన్ కోర్సుల్లో ప్రతి రోజూ 8 నుంచి 12 గంటల వరకు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ఇతర వివరాలకు 9440440939, 6304743121 ఫోన్‌నెంబర్లను సంప్రదించాలని కోరారు.



ఆధ్యాత్మికం.. ఆహ్లాదం

యాదాద్రి జిల్లాను చూసొద్దాం

- ఆధ్యాత్మిక, పర్యాటక క్షేత్రంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రం
- సమీపంలోనే బస్వాపూర్ రిజర్వాయర్
- సామాజిక ఉద్యమానికి నాంది పలికిన భూదాన్‌పోచంపల్లి
- సెలవుల్లో వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందిస్తున్న ప్రాంతాలు



సమ్మర్ స్పాట్ SUMMER SPOT

పిల్లలకు వేసవి సెలవులు వచ్చేశాయ్. ప్రముఖ ఆలయాలతో పాటు పర్యాటక క్షేత్రాలను సందర్శించేందుకు సన్నాహాలు చేసుకుంటారు. అయితే హైదరాబాద్ నగరానికి అతి చేరువలో ఉన్నటువంటి యాదాద్రిభువనగిరి జిల్లాలోని పలు పుణ్యక్షేత్రాలతో పాటు పర్యాటకప్రాంతాలను వేసవిలో ఎక్కువగా సందర్శిస్తారు. జిల్లాలో ప్రధానంగా యాదగిరిగుట్ట ఆలయంపాటు మత్స్యగిరి లక్ష్మీనృసింహస్వామి, కొలనుపాకలోని పురాతన శివాలయం, జైనమందిరం, భువనగిరిలోని స్వర్ణగిరి, సురేంద్రపురి, భూదాన్‌పోచంపల్లిలోని టూరిజం ప్రాంతాలను సందర్శిస్తుంటారు. ఆలయాలు కొండకోనల మధ్య పచ్చటి అందాలతో దర్శనమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు పర్యాటకులు ఆసక్తిచూపుతారు. దీంతో యాదాద్రిభువనగిరి జిల్లా టూరిస్ట్ హబ్ మారింది.

(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

యాదాద్రిభువనగిరి జిల్లాలో ప్రధానంగా అంతర్జాతీయ, ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రంగా రూపుదిద్దుకున్న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణమంతా హరితశోభను సంతరించుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రతీ కట్టడం ఆధ్యాత్మిక భావాలు ఉట్టిపడేలా, కొండపైన కృష్ణరాతి శిలలతో ఆలయం నిర్మించారు.అదే తరహాలోనూ గుట్ట పరిసర ప్రాంతాల్లో పచ్చని అందాలతో కనువిందు చేసే ప్రణాళికను రూపొందించారు. హైదరాబాద్ మహానగరంలోనే లేని విధంగా యాదగిరిగుట్టలోని రింగ్‌రోడ్డుల్లో సర్కిళ్లను సుందరంగా తీర్చిదిద్దారు. యాదగిరిగుట్ట కొండపైన, టెంపుల్ సిటీతో పాటు ఆలయానికి భక్తులు విచ్చేసే మార్గాల్లో పలురకాల పూలమొక్కలతో పాటు అరుదైన జాతి, దేవతావృక్షాలు, వేర్వేరు రంగులతో ఆకట్టుకునేలా పూలమొక్కలను నాటారు. దీంతో ఆలయ పరిసరాల్లోని పచ్చని అందాలు భక్తులను కనివిందు చేస్తున్నాయి. హైదరాబాద్-యాదగిరిగుట్ట రోడ్డుమార్గంలో ఇరువైపులా, మధ్యలో పూలమొక్కలతో పాటు ఇతర మొక్కలను నాటారు. రాయిగిరి చెరువు వద్ద సందర్శకుల కోసం రోడ్డుకు ఇరువైపులా గ్రీనరీని ఏర్పాటుచేశారు. స్వామి వారి చెంతకు విచ్చేసే భక్తులు కాసేపు ఈ ప్రాంతంలో ఆహ్లాదంగా గడుపుతున్నారు. వారి వెంట తెచ్చుకున్న ప్రసాదాలు, తినుబండారాలను తింటూ, పిల్లలతో సరదాగా పార్కులతో ఆటలు ఆడుతున్నారు. యాదగిరిగుట్ట కొండపైన, ప్రెసిడెన్సియల్‌సూట్స్, టెంపుల్ సిటీతో పాటు ఆలయ ప్రాంగణమంతా హరితమయంగా(ల్యాండ్‌స్కేప్) మార్చేందుకు రూ.20 కోట్లు ఖర్చు చేసింది. మొత్తం దాదాపుగా 108కి పైగా మొక్కలను యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో నాటారు. కొండపైన ఉత్తరం వైపు రెండో ఘాట్ ప్రాంతంలో గుట్టను తొలిచి, పచ్చని గడ్డితో పాటు పూల, ఇతర మొక్కలను నాటారు. ఈ ప్రాంతం భక్తులను కనువిందుచేస్తోంది. ప్రెసిడెన్షియల్ సూట్‌కు వెళ్లే రహదారిలో సుమారు 150 అడుగుల విశాలమైన సర్కిల్‌లో అరుదైన ఫినిక్స్ జాతికి చెందిన చెట్లను చెన్నై నుంచి తెచ్చి నాటారు.


ఈ సర్కిల్‌లో 12 రకాల వివిధ ఫినిక్స్ జాతికి చెందిన మొక్కలతో పాటు సీజనల్, ఆకర్షణీయమైన మొక్కలు నాటారు. ఈ సర్కిల్‌ను ఫినిక్స్ పామ్ సర్కిల్‌గా తీర్చదిద్దారు. యాదగిరిగుట్ట చుట్టూ ఆరులైన్ల రింగురోడ్డు రహదారిలో నాలుగుసువిశాల సర్కిళ్లను నిర్మించారు.

ఆధ్యాత్మిక సొబగులతో గండి చెరువు అభివృద్ధి

యాదగిరిగుట్ట కొండ కింద ఉన్న గండిచెరువు సుందరీకరణ పూర్తయ్యింది. ఆలయ ఉద్ఘాటన సమయంలో గోదావరి జలాలతో చెరువును నింపారు. 25 ఎకరాల విస్తీర్ణంలోని ఈ చెరువు చుట్టూ గుట్టకు విచ్చేసి భక్తులు, పిల్లాపాపలతో ఆహ్లాదంగా గడిపేందుకు వాకింగ్‌ట్రాక్, సైక్లింగ్ ట్రాక్‌తో పాటు గ్రీనరీని ఏర్పాటుచేశారు. ఈ చెరువు సుందరీకరణ కోసం రూ.33.69 కోట్లు కేటాయించారు. చెరువులో నృసింహుని తెప్పోత్సవానికి అనుగుణంగా ఘాట్లను నిర్మించారు. ల్యాండ్‌స్కేప్ వద్ద పాంచనారసింహ విగ్రహాలను ఏర్పాటుచేశారు. ఈ ప్రాంతంలో ఆకర్షణీయమైన ఫౌంటైన్‌ను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఆలయానికి గ్రీన్‌ప్లేస్ ఆఫ్ వర్షిప్ అవార్డు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి గ్రీన్ ప్లేస్ ఆఫ్ వర్షిప్(హరిత క్షేత్రం) అవార్డు లభించింది. ఆలయంలో సౌకర్యాలతో పాటు గ్రీనరీ, తదితర నిబంధనలు పాటించినందుకు ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ద్వారా 2022 నుంచి 25 ఏళ్ల వరకు ఈ అవార్డు పొందింది. ప్రధానంగా 13వ శతాబ్దానికి చెందిన స్వయంభూదేవాలయంలో దేవతా సంరక్షణ(గుహలో ఉన్న స్వయంభూవులను తాకకుండా), ఆలయ ప్రాంగణం, వెలుపల శిలసంరక్షణ చేపట్టారు. ఆలయంలోని గోడలపై ప్రభావం చూపకుండా ఇన్నోవేషన్ ఎయిర్‌కండిషనింగ్ డిజైన్‌తో పాటు 100శాతం కేంద్రీకృత ఎయిడ్ కండిషనింగ్ సూర్యకిరణాలు ఆలయంలోకి ప్రవేశించేలా ప్రత్యేకంగా రూపొందించి, ట్రిపుల్ ఎత్తులో సహజ కాంతి అం దేలా చేశారు. ఆలయంలో నాలుగు దశల్లో జల్లి కిటికీలు ఏర్పాటు చేయడంతో రద్దీ రోజుల్లోనూ భక్తులకు తాజా గాలి అందించేందుకు వెంటిలేషన్‌ను ఏర్పాటుచేశారు. మొత్తం ఆలయ ప్రాంగణంలో 40శాతం కంటే ఎక్కువ విస్తీర్ణంలో పచ్చదనాన్ని నెలకొల్పారు. భక్తుల కోసం 14 లక్షల సామర్థ్యం కలిగిన చెరువును, స్వచ్ఛమైన నీటి లభ్యత, భక్తులకు పార్కింగ్, షటిల్ సర్వీసు సౌకర్యాలు కల్పించింది. ఈ అవార్డుతో ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు పర్యాటకు సంఖ్య పెరిగింది.




ఏకశిల భువనగిరి ఖిల్లా...

రాష్ట్ర వారసత్వ సంపదలో ఒక్కటైన భువనగిరి ఖిల్లా అభివృద్ధికి ప్రభుత్వం దృష్టి సారించింది. దాదాపుగా రూ.100కోట్లు ఖిలా అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరుచేసింది. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి పక్కనే ఏకశిలతో ఉన్న ఇక్కడి ఖిల్లా ప్రాంతం పర్యాటకులను ఎంతోగానో ఆకట్టుకుంటోంది. ఇక్కడి కట్టడాలను తిలకించేందుకు సెలవురోజుల్లో దేశ, విదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. త్వరలోనే ఈ ప్రాంతంలో రోప్‌వేతో పాటు పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ నగరానికి 47కిలోమీటర్ల దూరంలో ఏకశిల రాతిగుట్టపై నిర్మించిన ప్రాచీనకట్టడం ఉంది. భువనగిరి కోట 610 మీటర్ల ఎత్తయిన ఈ కొండ రాష్ట్రంలోని ఉరుకొండ, ఉండ్రుకొండ, అనంతగిరుల కంటే ఎత్తయిన అండాకారపు ఏకశిలా పర్వతమైన ఈ కొండ దక్షిణం నుంచి చూస్తే తాబేలులా, పడమర నుంచి చూస్తే పడుకున్న ఏనుగులా కన్పిస్తుంది. ఇది బాటాఘాట్ పంక్తులలోని అనంతగిరి వరుసలలోనిది. భువనగిరి కోటను పశ్చిమచాళుక్య వంశానికి చెందిన 6వ త్రిభువన మల్లా విక్రమాదిత్య పాలనలో నిర్మించినట్టు చెబుతారు. ఆయన పేరు మీదనే దీనికి భువనగిరి కోటగా పిలుస్తారని, ఇది కాకతీయుల కాలంలో బాగా ప్రసిద్ధి చెందినట్టు చరిత్రకారుల కథనం. ఈ కొండకు నైరుతి, ఆగ్నేయ దిశల నుంచి పైకి వెళ్లే మార్గాలు ఉన్నాయి.

● ఇలా చేరుకోవాలి

యాదాద్రి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు చేరుకునేందుకు హైదరాబాద్ నుంచి బస్సు, రైలు మార్గాలున్నాయి. ఉప్పల్ నుంచి జిల్లాకేంద్రమైన భువనగిరి 40 కిలోమీటర్ల దూరం ఉంటుంది. సికింద్రాబాద్ నుంచి భువనగిరి వివిధ సమయాల్లో రైళ్లు ఉన్నాయి. అక్కడి నుంచి వివిధ దర్శనీయ ప్రాంతాలకు రోడ్డు మార్గంలో చేరుకోవచ్చు.



టూరిస్ట్ స్పాట్‌గా బస్వాపూర్

భువనగిరి మండలంలోని బస్వాపూర్(నృసింహసాగర్) రిజర్వాయర్ భవిష్యత్‌లో టూరిస్ట్ స్పాట్‌గా ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. యాదాద్రి క్షేత్రాన్ని సందర్శించే భక్తులకు ఆహ్లాదాన్ని అందించేందుకు ప్రభుత్వం తగినచర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా భువనగిరి మండలం బస్వాపూర్ వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్ నుంచి యాదాద్రి దివ్యక్షేత్రం వరకు కేబుల్ బ్రిడ్జిని ఏర్పాటుచేయాలనుకుంది. 11.39 టీఎంసీ సామర్థ్యంతో నిర్మాణమవుతోన్న బస్వాపూర్ రిజర్వాయర్ వద్ద మైసూర్‌లోని బృందావన్ గార్డెన్ స్థాయిలో థీమ్ పార్క్‌ను అభివృద్ధి చేయడానికి పర్యాటక శాఖ సన్నాహాలు ప్రారంభించింది. భక్తులకు ఈ థీమ్ పార్క్ ప్రధాన ఆకర్షణగా నిలిచేలా ప్రణాళికలు రూపొందించింది. ప్రభుత్వం మారిపోవడంతో ఈ ప్రణాళికలు పక్కన పెట్టింది. రానున్న రోజుల్లో బస్వాపూర్ వద్ద బోట్ షికారుతో పాటు టూరిజంపరంగా అభివృద్ధి చేయనున్నారు.



చేనేతకు ప్రసిద్ధి భూదాన్‌పోచంపల్లి

వినోబాభావే సందర్శనతో భూదానోద్యమానికి నాంది పలికింది పోచంపల్లి. దీంతో ఈ ఊరికి చారిత్రక ప్రాశస్త్యాన్ని కల్పించింది. చేనేత, భూదానోద్యమం ద్వారా పోచంపల్లి ఓ పర్యాటక పల్లెగా మారింది. చేనేత మార్కెటింగ్ కోసం వచ్చిపోయే వ్యాపారులు, కొనుగోలుదారులతోపాటు ఆచార్య వినోబాభావే నడయాడిన నేల, ఆయన కూర్చున్న జువ్విచెట్టు, ఆయన బసచేసిన చోటు వినోబా మందిరంగా నిలిచింది. పూర్వం దొరల కాలంలో సంతాన ప్రాప్తి కోసం ఇక్కడ నిర్మించిన 101 దర్వాజల భవనాన్ని సందర్శించేందుకు ఎంతోమంది పర్యాటకులు సందర్శించేవారు. 2007లో రూ.3.75కోట్లతో ఇక్కడ గ్రామీణ పర్యాటక కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. రూరల్ టూరిజం సెంటర్ నేడు విదేశీయులకు అధ్యయన కేంద్రంగా మారింది. గతంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని పోచంపల్లి టూరిజం పార్క్‌లో మేళాలను నిర్వహించారు. ఇందులో చేనేత వస్త్రాల ప్రదర్శన, చేతులతో తయారుచేసిన వస్తువులు, గ్రామీణ వంటకాల రుచులు, గ్రామీణ కళల్లో భాగంగా గంగిరెద్దుల ఆట, డప్పు కళాకారుల ఆటపాట, ఒగ్గు కళారూపాలను ప్రదర్శించి అలరించారు. పోచంపల్లిలోని చేనేత పట్టు చీరలకు ప్రాచుర్యం కల్పించేందుకు పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు స్థానిక టూరిజం పార్క్‌లో 2008లో ఫ్యాషన్ షోను ప్రదర్శించారు. ప్రముఖ నటి శోభనతో పాటు పలువురు మోడల్స్ పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలతో ఫ్యాషన్ షో నిర్వహించి పర్యాటకులను ఆకట్టుకున్నారు. ఈ ప్రాంతం ప్రపంచ అందెగత్తెలకు త్వరలో అతిథ్యం ఇవ్వనుంది.



వేసవిలో డిమాండ్ భళా

సమ్మర్ మార్కెట్ summer market

వేసవి వచ్చిందంటే ఎండవేడిమి నుంచి తప్పించుకునేందుకు, ప్రతి ఒక్కరూ చల్లటి వస్తువులను ఇష్టపడతారు. అంతేకాక ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు ఏసీ, ఫ్యాన్లు, విసనకర్రలను, కుండలను ఆశ్రయిస్తారు. ఈ క్రమంలో ఆయా వస్తువులకు డిమాండ్ ఉండటంతో పాటు మార్కెట్ ఉంటుంది. ఆ కోవలోకి వచ్చేవాటిలో ప్రధానంగా పుచ్చకాయలు, కుండలు, ముంజలు ముందు వరుసలో ఉంటాయి.

(ఆంధ్రజ్యోతి-కోదాడ)

డీహైడ్రేషన్‌ను తగ్గించే పుచ్చకాయ.



వేసవిలో పుచ్చకాయకు మంచి గిరాకీ ఉంటుంది. ఎండ నుంచి శరీరానికి హైడ్రేషన్ లభిస్తుంది. అంతేకాక దీనిలోని విటమిన్ సీ రోగ నిరోధక శక్తిని పెంచటంతోపాటు పొటాషియం అధికంగా ఉంటుంది. దీంతో వాటిని కొనేందుకు ప్రతి ఒక్కరూ ఇష్టపడుతారు. ఫలితంగా పుచ్చకాయకు వేసవిలో మంచి డిమాండ్ ఉండి ధర అధికంగా ఉంటుంది. కిలో రూ.20 నుంచి రూ.30 వరకు పలుకుతుంది.

శరీరం చల్లదనం కోసం ముంజలు..



వేసవిలో ప్రతి ఒక్కరికీ మేలు చేసేవి తాటి ముంజలు. ఇవి నీటిశాతం ఎక్కువగా కలిగి ఉంటాయి. శరీరానికి చల్లదనం ఇస్తాయి. డీహైడ్రేషన్ నివారిస్తాయి. జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. దీంతో వాటిని తినటానికి అందరు ఇష్టపడుతారు. ఫలితంగా వేసవిలో వాటికి డిమాండ్ ఎక్కువ. డజన్ ముంజలు రూ.50 నుంచి రూ.60 వరకు ఉంటాయి.

చేతిలోని ఫ్యాను విసనకర్ర..



పేదవాడి ఫ్యాన్ విసనకర్ర. వేసవిలో ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు, చల్లనిగాలి కోసం వాటిని కొనుగోలు చేస్తారు. దీంతో వేసవిలో వాటి డిమాండ్ అధికంగా ఉంటుంది. విసనకర్రలు తాటి ఆకులు, వెదురు బద్దలు లాంటి తేలికైన వాటితో తయారుచేస్తారు. చేతితో పట్టుకొని ముందుకు, వెనక్కి కదిలించటం ద్వారా గాలి రావటంతో, ఉక్కపోత నుంచి తప్పించుకోవటం వీలుగా ఉంటుంది. ఒక్కో విసనకర్ర రూ.25 నుంచి రూ.50 వరకు ఉంటుంది.

పేదవాడి ఫ్రిజ్ కుండలు..



కుండలను పేదవాని ఫ్రిజ్‌గా పిలుస్తుంటారు. వేసవిలో దాహార్తి అధికంగా ఉండటం సహజం. మట్టి కుండలో నీటిని నిలవచేయటంతో నీరు చల్లగా ఉంటుంది. దాహార్తి నుంచి ఉపశమనం పొందేందుకు కుండలను ఆశ్రయిస్తారు. దీంతో వేసవిలో వాటికి ఎక్కువగా ఉంటుంది. ఒక్కో కుండ సైజును బట్టి రూ.100 నుంచి రూ.300 వరకు ఉంటుంది.



కోదాడ ఉన్నత పాఠశాలలో నీటితొట్లు ఏర్పాటు చేస్తున్న ఉపాధ్యాయులు

పక్షుల దాహార్తిని తీర్చేందుకు నీటితొట్లు

కోదాడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పక్షుల దాహార్తిని తీర్చేందుకు సూర్యాపేట జిల్లా కోదాడ ఎంఈవో ఎండీ సలీంషరీఫ్ కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో నీటినిల్వ తొట్టి బాక్సులను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్షుల పట్ల కరుణ, దయ ఉండాలన్నారు. వేసవిలో పక్షుల దాహార్తిని తీర్చేందుకు ప్రకృతి ప్రేమికులుగా ఉపాధ్యాయులందరూ కలిసి నీటి నిల్వ తొట్టిలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం మార్కండేయ, దేవరాజు, ఖాజామియా, బడుగుల సైదులు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్, ఐరన్ ధరలు పైపైకి

(3వ పేజీ తరువాయి)

50 టన్నుల సిమెంట్ ఉత్పత్తి అవుతోంది. ఆయా కంపెనీలు ఉమ్మడి జిల్లాలో ఉన్న సుమారు 550 సిమెంట్ దుకాణాల ద్వారా విక్రయాలు నిర్వహిస్తున్నాయి. నిత్యం ఆయా దుకాణాల ద్వారా 80,000 నుంచి 1,00,000 బస్తాల సిమెంట్ విక్రయం అవుతోంది. మార్చి నెలలో బస్తా ధర రూ.277ఉండగా, ప్రస్తుతం రూ.337కి పెరిగింది. ఒక్కో బస్తాపై రూ.60 అదనంగా ధర పెరిగింది. దీంతో ఉమ్మడి జిల్లా వాసులపై రోజుకు రూ.48లక్షలు, నెలకు రూ.14.40కోట్ల అదనపు భారం పడుతోంది.

సిమెంట్ ధర మరో రూ.20 పెరిగే అవకాశం

దేశీయ మార్కెట్‌లో సిమెంట్ ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో సిమెంట్ ధరలు 2 నుంచి 4శాతం (సుమారు రూ.15 నుంచి రూ.20) మేర పెరిగే అవకాశం ఉందని క్రిసిల్ ఇంటెలిజెన్స్ సంస్థ అంచనా వేసింది.

కేంద్ర ప్రభుత్వం ప్రధాన మౌలిక సదుపాయాలైన హౌసింగ్ ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయింపులు 10శాతం పెంచిన నేపథ్యంలో సిమెంట్ రంగంలో డిమాండ్ 6.5 నుంచి 7.5శాతం పెరుగుతుందని అంచనా వేసింది. ఫలితంగా గత ఏడాదితో పోల్చితే, ఈ ఆర్థిక సంవత్సరం సిమెంట్ పరిశ్రమలకు కలిసివచ్చే అవకాశం ఉంది.

వ్యాపారం చేయడం కష్టంగా ఉంది



రోజుకు 150 నుంచి 200 బస్తాల సిమెంట్ విక్రయిస్తుంటా. ఇప్పుడు ధరలు పెరగడంతో 100 బస్తాలు కూడా విక్రయించలేకపోతున్న. గత నెల కొంత వరకు విక్రయాలు బాగానే ఉన్నాయి. ధరలు పెరగడంతో కొత్త ఇంటి నిర్మాణం చేసేవారు తప్ప, పాత ఇళ్ల మరమ్మతులకు ఎవ్వరూ సిమెంట్ కొనుగోలు చేయడం లేదు. దీంతో కొంత వరకు విక్రయాలు తగ్గాయి. పెట్టిన పెట్టుబడికి వడ్డీ కూడా రావడంలేదు. వ్యాపారం చేయడం కష్టంగా ఉంది. వర్కర్ల వేతనాలు, దుకాణాల అద్దెలు కట్టలేకపోతున్నాం.

నువ్వుల రామారావు, సిమెంట్ వ్యాపారి

● ధరల పెరుగుదలతో అదనపు భారం



నెల క్రితం స్క్వేర్ ఫీట్‌కు రూ.1,700 చొప్పున, 200 గజాలకు 1,500 స్క్వేర్ ఫీట్స్‌కు నిర్మాణ వ్యయం రూ.25.50లక్షలు అవుతోంది. ప్లాట్ ధర అదనం. సిమెంట్, ఐరన్, కలర్స్, ఇతర సామగ్రి ధర పెరగడంతో మొత్తంగా స్క్వేర్ ఫీట్‌కు రూ.2,000 ఖర్చు వస్తోంది. దీంతో అదనంగా రూ.4.50లక్షల భారం పడుతోంది. రూ.25లక్షలు అవుతుందనుకుంటే నిర్మాణ వ్యయం రూ.30లక్షలు దాటుతోంది. ఇలా ధరలు పెరగటంతో అదనపు భారం భరించాల్సి వస్తోంది. సిమెంట్ బస్తాపై రూ.60, ఐరన్ టన్నుపై రూ.5,000, విద్యుత్ సామగ్రికి రూ.1.50లక్షల నుంచి రూ.2.50లక్షలు, పెయింటింగ్‌కు రూ.2లక్షలు అనుకుంటే రూ.4లక్షలకు వ్యయం పెరిగింది. రూ.6 ఉన్న ఇటుక ధర రూ.7కు, రాడ్‌బెడింగ్, మోటారు ఇలా అన్ని ధరలు పెరిగాయి. ధరలు పెరిగాయని ఇంటి నిర్మాణం ఆపలేం కదా. పెరిగిన ధరలను భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ధరల పెరుగుదలతో అనుకున్న బడ్జెట్ మారడంతో కొంత అప్పు చేయాల్సి వస్తోంది. ధరల పెరుగుదల పరిశ్రమలకు అనుకూలంగా ఉండవచ్చు గానీ, గృహనిర్మాణదారులకు ఇబ్బందే.

మారంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నూతన గృహ నిర్మాణదారుడు, కోదాడ

నేటి నుంచి మఠంపల్లిలో పెద్దపండుగ తిరునాళ్లు



మఠంపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): దక్షిణ తెలంగాణలోనే అతిపెద్ద చర్చిగా పేరుగాంచిన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలోని శుభవార్త దేవాలయం 29 వసంతాలు పూర్తయిన సందర్భంగా వార్షిక మహోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. 26 వరకు జరిగే వేడుకలకు దేవాలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. వేడుకల్లో భాగంగా విచారణ గురువు మార్టిన్ పసల ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఆరు గంటలకు నవదిన జపములు, దివ్యబలిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు సమష్టి దివ్యబలిపూజను పీఠాధిపతులతో నిర్వహించనున్నారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై మరియమాత విగ్రహాన్ని ఊరేగిస్తారు. అదేవిధంగా శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 29 వరకు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల బండలాగుట బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గాదె జయభరత్‌రెడ్డి తెలిపారు.

పంటల బీమా అమలుకు
ఎకరం యూనిట్‌గా తీసుకోవాలి

ఆంధ్రజ్యోతి జన వాక్యం

రాష్ట్రంలో పంటల బీమా పథకం అమలుకు సంబంధించి గ్రామం, మండలం యూనిట్‌గా కాకుండా ఎకరాన్ని యూనిట్‌గా తీసుకోవాలని రైతులు, రైతు సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న విధానంతో కొంతమంది రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. పంటల బీమా పథకం రూపకల్పనలో ప్రభుత్వం క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. పంటలు నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం వర్తింపజేయాలని కోరుతున్నారు.

● ఆంధ్రజ్యోతి, చౌటుప్పల్.

రైతులకు న్యాయం చేయాలి



బీమాకు సంబంధించి గ్రామం మండలాల వారీగా కాకుండా కమతాలవారీగా బీమా సౌకర్యం వర్తింపజేయాలి. అప్పుడే రైతుందరికీ న్యాయం జరుగుతుంది. ఈ ప్రాంతంలో ఆశించిన స్థాయిలో సాగునీటి సౌకర్యం లేకపోవడంతో ఎక్కువ శాతం వర్షాధారంపై ఆధారపడి రైతులు పంటలు పండిస్తారు. పంటల బీమా పథకం రూపకల్పనకు సంబంధించి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం బీమా పథకం అమలులో కూడా పెద్దపీట వేయాలి.

● ఏపూరి సతీష్ రైతు, సంస్థాన్ నారాయణపురం

అన్ని పంటలకు బీమా వర్తింపజేయాలి



ప్రభుత్వం అన్ని రకాల పంటలకు బీమా సౌకర్యం వర్తింపజేయాలి. ఈ ప్రాంతంలో ఎలాంటి సాగునీటి వనరు లేదు. బోర్లు, వర్షాలపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నాం. అతివృష్టి వచ్చినా, అనావృష్టి వచ్చినా తీవ్రంగా నష్టపోతున్నాం. యాసంగి, వానాకాలం తేడా లేకుండా రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోవాలి. చీడపీడలతో కూడా పంటలు దెబ్బతింటున్నాయి. దానిని కూడా పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలి.

● జక్కిడి వెంకట్‌రెడ్డి రైతు, సంస్థాన్ నారాయణపురం

రైతులకు ఉపయోగపడే విధంగా ఉండాలి



ప్రభుత్వం ప్రవేశపెట్టే పంటల బీమా పథకం రైతులందరికీ ఉపయోగపడే విధంగా ఉండాలి. గ్రామం మండలం అనే నిబంధనలు లేకుండా పంటలు సాగు చేసిన రైతులందరికీ బీమా వర్తింపజేసే విధంగా ఉండాలి. యాసంగి, వానా కాలంతో సంబంధం లేకుండా అన్ని రకాల పంటలకు నష్టం జరిగినప్పుడుపరిహారం ఇవ్వాలి. అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేయాలి.

● శివరాత్రి విద్యాసాగర్, బీఆర్ఎస్ నాయకుడు

ఎకరం ఆధారంగా బీమా వర్తింపజేయాలి



పంటల బీమాకు సంబంధించి ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేసే విధానం సరిగా లేదు. మండలం వారీగా గ్రామం వారిగా కాకుండా ఎకరం వారీగా బీమా సౌకర్యం వర్తింపజేయాలి. ఒక గ్రామానికి సంబంధించి రెవెన్యూ పరిధిలో ఒక ప్రాంతంలో వర్షం పడి మరో ప్రాంతంలో వర్షం పడకపోతే ప్రభుత్వం వర్షం పడిన ప్రాంతాన్ని పరిగణనలోకి తీసుకోవడం వల్ల మిగతా రైతులకు నష్టం వాటిల్లుతుంది.

● పల్లె మల్లారెడ్డి, రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి సంస్థాన్ నారాయణపురం, యాదాద్రిభువనగిరి జిల్లా.

బెట్టింగ్.. ఆగమవుతున్న జీవితం

● హుజూర్‌నగర్‌లో జోరుగా ఆన్‌లైన్ బెట్టింగ్ ● పాన్‌షాపులు, కిరాణ షాపులే కేంద్రాలు ● దొరికింది కొందరే.. దొరకాల్సింది ఎందరో

రాత్రి, పగలు తేడా లేకుండా ప్రస్తుతం యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో కూరుకుపోతున్నారు. ఈ వ్యసనం గతంలో కొంత మందికే పరిమితం కాగా, ప్రస్తుతం చాలా మంది ఈ ఊబిలో కూరుకుపోతున్నారు. డబ్బులు ఎర చూపడంతో ఆశతో యువకులు అటు వైపు ఆకర్షితులవుతున్నారు. కొందరికే పరిమితమైన ఈ వ్యసనం ఇప్పుడు ప్రైవేట్, ప్రభుత్వ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వ్యాపారులు వరకు వెళ్లింది. మొబైల్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకొని యువకులు బలవుతున్నారు. బెట్టింగ్ కాసే వారిలో 99శాతం మంది డబ్బులు పోగొట్టుకుంటున్నారు. భారీగా సంపాదించవచ్చనే అత్యాశ జీవితాలనే నాశనం చేస్తోంది.

● ఆంధ్రజ్యోతి - హుజూర్‌నగర్.



ఇటీవల సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న తెలంగాణ, ఏపీ ప్రాంతాలకు చెందిన ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరు కొంతకాలం నుంచి ఆన్‌లైన్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లకు బెట్టింగ్ పెడుతున్నారు. హుజూర్‌నగర్ ప్రాంతంలో ఎంతోమంది యువకులు బెట్టింగ్ జూదంలో మునిగి తేలుతున్నారు. లక్షల రూపాయల బెట్టింగ్‌లు కట్టి అప్పుల పాలవుతున్నారు. చేతిలో సెల్‌ఫోన్ ఉంటే చాలు బెట్టింగ్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుని ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ మొత్తం ఆటతో పాటు ఆటగాళ్లపై పందెం కాస్తున్నారు. పట్టణంలోని గోవిందాపురం, చింతలబజారు, శ్రీనగర్‌కాలనీ, ఎస్ఎస్‌పీ క్యాంప్, టీచర్స్‌కాలనీ, మల్లన్ననగర్, ఇందిర సెంటర్‌తో పాటు అనేక ప్రాంతాల్లో యువకులు సిండికేట్‌గా మారి ఆన్‌లైన్ జూదం ఆడుతున్నారు. ముఖ్యంగా చిన్న చిన్న కిరాణ షాపుల నిర్వాహకులు, వైన్‌షాపుల్లో పనిచేసే యువకులు, పాన్‌షాప్‌ల నిర్వాహకులతో పాటు నిత్యం క్రికెట్ ఆడుతున్న అనేకమంది యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పాలుపంచుకున్నట్లు తెలిసింది. ఒక్క హుజూర్‌నగర్ ప్రాంతంలోనే సుమారు 120 మంది యువకులకు పైగా ఆన్‌లైన్‌లో భాగస్వామ్యమవుతున్నట్లు తెలుస్తోంది.

పోలీస్ యంత్రాంగం అప్రమత్తం

జిల్లా పోలీస్ యంత్రాంగం బెట్టింగ్ యాప్‌లపై దృష్టి పెట్టిన నేపథ్యంలో మూడురోజుల క్రితం హుజూర్‌నగర్, గరిడేపల్లి ప్రాంతాలకు చెందిన అనేక మంది యువకులు బెట్టింగ్‌యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుని ఆడుతున్నట్లు బట్టబయలైంది. కొంతమంది యువకులు ఐపీఎల్ ప్రతి మ్యాచ్‌కు సంబంధించి బాల్‌టూ బాల్, ఒక్కొక్క ఓవర్, 2020 మ్యాచ్ మొత్తం, అదేవిధంగా వివిధ మ్యాచ్‌లలోని కీలక ఆటగాళ్ల రన్స్, బౌలింగ్‌లపై బెట్టింగ్ పెట్టినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అనేకమంది ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసయ్యారు. ఆన్‌లైన్ బెట్టింగ్ చేసే యువకులు గంజాయి లాంటి మత్తుపదార్థాలు సేవిస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది యువకులు బెట్టింగ్‌లో పెద్ద మొత్తంలో నష్టపోయి హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లో చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యులను భయపెట్టి, బెదిరించి ఇంట్లో డబ్బులు తీసుకుని బెట్టింగ్‌లో ఓడిపోయిన కొంతమంది యువకులు గంజాయికి బానిసగా మారినట్లు తెలుస్తోంది.

కఠిన చర్యలు తీసుకుంటాం

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై కఠిన చర్యలు తీసుకుంటాం. బెట్టింగ్ నిర్వహించే, ఆడే వ్యక్తుల గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలి. సులభంగా డబ్బులు సంపాదించాలనే దురాశతో బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. డివిజన్ వ్యాప్తంగా బెట్టింగ్‌కు పాల్పడే వ్యక్తుల వివరాలు సేకరిస్తున్నాం.

● చరమందరాజు, హుజూర్‌నగర్ సీఐ.

ఓపెన్ పరీక్షలో మాస్‌కాపీయింగ్

● ఓపెన్ టెన్త్ పరీక్షలకు ఒకరికి బదులు మరో అభ్యర్థి ● తనిఖీల్లో పట్టుకున్న తహసీల్దార్ ● ఇద్దరిపై కేసు నమోదు

మిర్యాలగూడ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఓపెన్ టెన్త్ పరీక్షల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయి. పరీక్షా నిర్వాహకులు నిబంధనలకు పాతరేసి పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ చేయిస్తున్నారని ఆరోపణలు రావడంతో గురువారం సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ ఆదేశాల మేరకు అధికారులు తనిఖీలు నిర్వహించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో ఒకరికి బదులుగా మరో అభ్యర్థి పరీక్ష రాస్తుండగా తహసీల్దార్ హరిబాబు, ఎంఈవో బాలునాయక్ పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బకాల్‌వాడ ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్ పరీక్షలకు దరఖాస్తు చేసిన గువ్వల శ్రీనివాస్‌కు స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో సెంటర్ పడింది. గువ్వల శ్రీనివాస్‌కు బదులుగా అప్పాముల ఎనివాస్ అనే మరో విద్యార్థి పరీక్ష రాస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 20 నుంచి పరీక్షలు జరుగుతుండగా చివరి రోజు సాంఘిక శాస్త్రం పరీక్ష జరుగుతుందన్నారు. ఓపెన్‌టెన్త్ పరీక్షల్లో భారీగా అవకతవకలు జరుగుతున్నాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య సబ్ కలెక్టర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారని, దీంతో తహసీల్దార్ హరిబాబును, ఎంఈవో బాలునాయక్‌ను తనిఖీలు చేయాలని సబ్ కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రం-8లో తనిఖీలు చేయగా 166 రూల్‌నెంబర్‌పై అభ్యర్థికి బదులు మరొకరు పరీక్ష రాస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లు, కోఆర్డినేటర్లపై విచారణ చేసి డీఈవోకు నివేదిక అందజేస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ హరిబాబు, ఎంఈవో బాలునాయక్

అధిక మోతాదులో ట్యాబ్లెట్ల స్వాధీనం

● వైద్యుడి సిఫారసు లేకుండా వినియోగం, విక్రయం

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వైద్యుడి సిఫారసు లేకుండా అధిక మొత్తంలో ట్యాబ్లెట్లను తీసుకువచ్చి విక్రయిస్తున్న ముఠాను నల్లగొండ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శివరాంరెడ్డి వివరాలు వెల్లడించారు. నల్లగొండలోని అక్కచెల్మ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఖాజా వసీముద్దీన్ అలియాస్ వసీంఅక్రం కొంతకాలంగా నొప్పికి ఉపశమనం కలిగించే ట్యాబ్లెట్లను వినియోగిస్తూ వాటికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో అదే ప్రాంతానికి చెందిన ఖాజా షోయబ్, అమేర్‌లతో కలిసి మెడికల్ షాపుల ద్వారా ట్యాబ్లెట్లను కొనుగోలు చేసి అవసరమైన వారికి విక్రయించేవారు. నల్లగొండ పరిసరాల్లో ఇటువంటి ట్యాబ్లెట్స్ విక్రయించకపోవడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పిడుగురాళ్లలోని ఛాయా మెడికల్ షాపు నిర్వాహకుడు మణిదీప్ ద్వారా ఒక్కో ట్యాబ్లెట్ షీట్‌ను రూ. రూ.100 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. అవసరం ఉన్నవారికి రూ.180కు విక్రయిస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. ఈ క్రమంలో మహ్మద్ వసీముద్దీన్ పిడుగురాళ్ల నుంచి 288 షీట్‌లను తీసుకొని వస్తున్నాడు. బుధవారం నల్లగొండ శివారు మునుగోడు రోడ్డులో పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా వసీముద్దీన్ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడు నేరాన్ని అంగీకరించటంతో పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన కొప్పరివారి యశ్వంత్ మణిదీప్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.25వేల విలువైన 2400 స్పాస్మో ట్యాబ్లెట్లు, బైక్, రూ.22వేల నగదు, రెండు సెల్‌ఫోన్‌లు, దుకాణానికి సంబంధించిన లైసెన్స్ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. షేక్ అమీద్, ఖాజా షోయబ్ పరారీలో ఉన్నారని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ వేమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ సందీప్‌రెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి.. భర్తకు గాయాలు

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని రెడ్డిబావి జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతిచెందగా భర్తకు గాయాలయ్యాయి. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని ఏపూరు గ్రామానికి చెందిన కొండె జంగయ్య(42), భార్య హైమావతి(37) దంపతులు బైక్‌పై చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి వస్తుండగా డీసీఎం వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. గాయపడిన ఇద్దరిని అంబులెన్స్‌లో చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా హైమావతి మార్గమధ్యలో మృతిచెందింది. మృతదేహానికి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. జంగయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డిప్యూటీ తహసీల్దార్‌పై బదిలీ వేటు

కట్టంగూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కట్టంగూరు డిప్యూటీ తహసీల్దార్ సుకన్యను బదిలీ చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మండల పరిధిలోని చెర్వుఅన్నారం రెవెన్యూ పరిధిలోని గార్లబాయి గూడెంకు సంబంధించిన సర్వే నెంబర్లు 155,157, 161,162లలోని ఆరు ఎకరాల 18 గుంటల భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంలో వివాదం నెలకొంది. బాధితుల ఫిర్యాదు నేపథ్యంలో అధికారులు విచారణ జరిపించి అనంతరం ఆమెను కలెక్టరేట్‌కు బదిలీ చేస్తూ కలెక్టర్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

డ్రంకెన్ డ్రైవ్.. పలువురికి జరిమానా

సూర్యాపేటక్రైం, ఏప్రిల్ 24, (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారికి సూర్యాపేట ద్వితీయ శ్రేణి కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించింది. సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ ఆర్. సాయిరాం తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 23వ తేదీన సూర్యాపేటలోని పలు ప్రాంతాల్లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేయగా ఐదుగురు వ్యక్తులు మోతాదుకుమించి మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడినట్లు తెలిపారు. వారిని గురువారం సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బీవీ రమణ ముందు హాజరుపర్చగా వారిలో ఒకరికి ఒకరోజు జైలు శిక్షతో పాటు రూ. 2వేల జరిమానా, మిగిలిన నలుగురికి కలిపి రూ.4500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు వివరించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే జైలుకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు.

పంటల బీమాకు సన్నాహాలు

(3వ పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికశాఖ, వ్యవసాయశాఖకు ఆదేశాలు జారీచేసింది. వానాకాలంతో పాటు యాసంగి సీజన్‌లో ఏ పంటలకు బీమా వర్తింపజేయాలనే అంశంపై అధికారులను ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించింది. ప్రకృతి విపత్తులతో పంట నష్టం వాటిల్లితే బీమా వర్తింపజేయనున్నారు. అందుకు క్లస్టర్లు ఏర్పాటుచేశారు. దిగుబడి ఆధారిత బీమా పథకంలో వరి ఉండగా, వాతావరణ ఆధారిత బీమా పథకంలో పత్తి పంటకు చోటు కల్పించారు. ఉద్యాన పంటలైన బత్తాయి తోటలతో పాటు ఆయిల్‌పామ్, మిరప, కూరగాయల సాగులో టమాటాకు బీమాను వర్తింపజేస్తారు. రైతుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని బీమా వర్తింపజేసేందుకు పంటలను గుర్తించాలని అధికారులకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కాగా, ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలులో తెచ్చేందుకు సన్నాహాలు చేస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బీమా కంపెనీలతో చర్చలు

పంటల ఉచిత బీమా పథకం అమలు కోసం బీమా కంపెనీలతో ఒప్పందాలు, ప్రీమియం నిర్ధారణ కోసం రాష్ట్రస్థాయిలో అధికారులు ఇప్పటికే చర్చలు పూర్తిచేశారు. వ్యవసాయశాఖ ద్వారా చేపట్టే క్రాప్ బుకింగ్ యాప్‌లో పంటల వివరాలు నమోదైతే పంట నష్టం జరిగినప్పుడు బీమా వర్తింపజేస్తారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 21.50లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. ప్రధానంగా నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఆయకట్టు కింద నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో పెద్ద మొత్తంలో వరి సేద్యమవుతోంది. డిండి ప్రాజెక్టుతో పాటు ఏఎమ్మార్పీ, మూసీ ప్రాజెక్టుతో పాటు యాదాద్రి జిల్లాలోని మూసీ పరివాహక ప్రాంతంలో వరి అధికంగా సేద్యమవుతోంది. మూడు జిల్లాలోనూ మెట్ట ప్రాంతాల్లో రైతులు అత్యధికంగా పత్తికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎంత సాగు అయితే అంతా మేరకు పంటల బీమా పథకం అమలు చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించాల్సి ఉంది. ఈ పథకాన్ని మెరుగైన విధంగా అమలు చేసేందుకు ఉమ్మడి జిల్లా వారీగా చర్చలు జరిపినా, రైతులతో సదస్సులు మాత్రం నిర్వహించలేదు. త్వరలోనే సదస్సులు కూడా ఏర్పాటు చేసి రైతులకు అధికారులు అవగాహన కల్పించనున్నారు.

వరికి గ్రామం, పత్తికి మండలం యూనిట్

వరి పంటకు బీమా పథకాన్ని గ్రామం యూనిట్‌గా అమలు చేయనున్నారు. 250ఎకరాలను ఒక యూనిట్‌గా తీసుకుంటారు. ఒక చిన్న గ్రామం లేదంటే తండాలో 50 ఎకరాల నుంచి 100 ఎకరాలు వరి ఉంటే, పక్క గ్రామంలో వరి సేద్యాన్ని కలిపి 250 ఎకరాలను ఒక యూనిట్‌గా చేస్తారు. పత్తిని మాత్రం మండల యూనిట్‌గా తీసుకుంటారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని పీఎం ఫసల్ బీమా యోజనలో చేరి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకున్న పంటల బీమాను అందుబాటులోకి తీసుకురావాలని కసరత్తు చేసి, ఆ తరువాత దీన్ని పక్కనపెట్టారు. వాస్తవానికి గత వానాకాలంలో టెండర్ల ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంది. అయితే పంటల బీమా కోసం పిలిచే టెండర్లను ఏకమొత్తంగా కాకుండా క్లస్టర్ల వారీగా పిలవాలని వ్యవసాయశాఖ నిర్ణయించినట్లు సమాచారం. పీఎంఎఫ్‌బీవై మార్గదర్శకాలను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం పంటల ఉచిత బీమా పథకాన్ని అందుబాటులోకి తీసుకురానున్న నేపథ్యంలో ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని నిర్ణయించింది. టెండర్ల ప్రక్రియ పూర్తయితేనే నిధులపై స్పష్టత రానుంది. రాష్ట్రం తన వాటా చెల్లించిన తరువాతే కేంద్ర వాటా జమ చేయనుండటంతో త్వరితగతిన రాష్ట్రం ఈ పథకాన్ని అమలు చేయాల్సి ఉంటుంది. పంటల గుర్తింపు, దిగుబడి లెక్కింపునకు సాంకేతికతను వినియోగించనుండగా అందుకోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకరానున్నారు. అదే సమయంలో సాంకేతికతతో పాటు ఆఫ్‌లైన్‌లో పంటల వివరాలను గుర్తించనున్నారు. వాస్తవానికి ఈ పాటికే పంటల బీమా అమలులోకి వచ్చి ఉంటే ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు లబ్ధి చేకూరేది. కానీ, ప్రభుత్వం ఏడాదిన్నర కాలంగా ఎటూ తేల్చకపోవడంతో బీమా పథకం ఆలస్యమై ఇటీవల పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందకుండా పోయింది. పంటల బీమా అమలుకు ఆదేశాలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తాం

త్వరలో పంటల బీమా పథకం అందుబాటులోకి రానుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు పంటల బీమా పథకంపై చర్చలు జరిపింది. అందుకు సంబంధించి కసరత్తు కూడా మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వ్యవసాయశాఖకు మార్గదర్శకాలు వచ్చిన వెంటనే పథకం అమలుకు మార్గం సుగుమం అవుతుంది. పంటల బీమా పథకం అమలులోకి వస్తే ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాలతో పంట నష్టం వాటిల్లితే రైతులకు పరిహారం త్వరితగతిన అందుతుంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ఏ పంటలకు బీమా వర్తింపజేయాలనే దానిపై నివేదిక అందజేస్తాం.

● పి.శ్రవణ్‌కుమార్, నల్లగొండ జిల్లా జేడీఏ

సాగర్‌ను సందర్శించిన కేఆర్ఎంబీ చైర్మన్



బుద్ధుడి పాదాల వద్ద అంజలిఘటిస్తున్న కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్ జైన్

నాగార్జునసాగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యాటక కేంద్రమైన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌ను గురువారం కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(కేఆర్ఎంబీ) చైర్మన్ అతుల్ జైన్ సతీసమేతంగా సందర్శించారు. ఉదయం విజయవిహార్ అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు నీటిపారుదల శాఖ అధికారులు స్వాగతం పలికారు. అనతంరం హిల్‌కాలనీలోని బుద్ధవనం ప్రాజెక్టును సందర్శించారు. అక్కడ బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈవో శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్రలు బుద్ధవనం విశేషాలను వివరించారు. పర్యాటకశాఖ లాంచీలో జలాశయంలోని నాగార్జునకొండకు చేరుకుని మ్యూజియం, సింహాళీయం, బౌద్ధమత స్తూపాలను, నమూనాలను తిలకించారు. ఆ తర్వాత సాగర్ ప్రధాన డ్యాం, ప్రధాన జలవిద్యుత్ కేంద్రాన్ని తిలకించారు. వారి వెంట సాగర్ ప్రాజెక్టు ఇన్‌చార్జి ఎస్ఈ మల్లిఖార్జున్‌రావు ఉన్నారు.

ప్రమాదాలకు చెక్

● ముకుందాపురం బ్లాక్‌స్పాట్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం ● ఫ్లైఓవర్‌కు రూ.25 కోట్లు ● అండర్‌పాస్‌కు రూ.5కోట్లు



రామాపురం క్రాస్‌రోడ్డు బ్లాక్ స్పాట్ వద్ద ఫ్లైఓవర్ నిర్మించే ప్రాంతం

కోదాడరూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ(65)వ నెంబర్ జాతీయ రహదారిపై నిత్యం జరిగే ప్రమాదాలకు అడ్డుకట్ట పడనుంది. ఇందుకోసం బ్లాక్‌స్పాట్ల వద్ద ఫ్లైఓవర్ల నిర్మాణం మొదలుపెట్టారు. ప్రమాదాల నివారణకు గత ప్రభుత్వం జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ ఫ్లైఓవర్లు ఏర్పాటు చేయాలని జాతీయ రహదారి అధికారులు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. హైదరాబాద్, చౌటుప్పల్ నుంచి ఆంధ్ర సరిహద్దు రామాపురం క్రాస్‌రోడ్డు వరకు మొత్తం 13ప్రాంతాల్లో ఫ్లైఓవర్లు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కూడా మంజూరుచేసింది. ఒక్కో ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.25కోట్లు, అండర్‌పాస్ నిర్మాణానికి రూ.5కోట్లు మంజూరయ్యాయి. దీంతో కోదాడ నియోజకవర్గ పరిధిలో ముకుందాపురం, ఆకుపాముల గ్రామాల వద్ద అండర్ పాస్, రామాపురం క్రాస్‌రోడ్డు, కొమరబండ గ్రామాల వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పనులు దక్కించుకున్న సంబంధిత కాంట్రాక్టర్లు ఫ్లైఓవర్లు నిర్మించేందుకు వాహనాల రాకపోకలకు వీలుగా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు. రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న సర్వీస్‌రోడ్డును మరింత వెడల్పు చేసేందుకు రోడ్డు పక్కన ఉన్న హోటళ్లు, బడ్డీకొట్లు, షాపులను తొలగించారు. అక్కడ ఉన్నసర్వీస్ రోడ్డును మూడు వాహనాలు వెళ్లే విధంగా రోడ్డును వెడల్పు చేస్తున్నారు. కొమరబండ గ్రామం వద్ద ఇప్పటికే ఫ్లైఓవర్ నిర్మిస్తుండడంతో ఇరువైపులా వాహనాలు వెళ్లేందుకు సర్వీస్ రోడ్లు నిర్మిస్తున్నారు. 15 రోజుల్లో సర్వీస్ రోడ్లు పూర్తిచేసి వచ్చే నెలలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.



రోడ్డు పక్కన దుకాణాలు తొలగిస్తున్న అధికారులు

ఇంటర్‌లో మైనార్టీ బాలికల ప్రతిభ

నకిరేకల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో నకిరేకల్ మైనార్టీ జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ సాధించారు. ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో 500 మార్కులకు గాను సానియామీర్జా 475, హిమబిందు 474, శహనాజ్ 469, హారిక 453, రుతి 437 చొప్పున మార్కులు సాధ్విఆరు. జిల్లా స్థాయిలో ప్రతిభ సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ షాహిన్‌అస్మా తెలిపారు. నాలుగేళ్ల నుంచి తమ కళాశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్ర, జిల్లాస్థాయిలో ర్యాంకులు సాధిస్తున్నారని ఆమె తెలిపారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

కనగల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ కరీంపాష కోరారు. కనగల్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సభకు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీ‌ష్‌రావు, కేటీఆర్ పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో నాయకులు ఐతగోని యాదయ్యగౌడ్, దోటి శ్రీనివాస్, కృష్ణయ్య, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై నీడ

- నీలగిరిలో సిగ్నల్ పాయింట్స్ వద్ద చలువ పందిళ్లు
- కాసేపు ఉపశమనం పొందుతున్న వాహనాదారులు
- అన్ని సిగ్నల్ పాయింట్ల వద్ద ఏర్పాటు చేయాలి



ఎన్‌జీ కళాశాల సిగ్నల్ వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్ మ్యాట్

రామగిరి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఈ వేసవిలో రోడ్లపై ప్రయాణించే వాహనాదారులకు సిగ్నల్ పాయింట్ల నీడ కల్పించేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంకల్పించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నల్లగొండ పట్టణంలోని సిగ్నల్ పాయింట్ల వద్ద తాత్కాలిక గ్రీన్‌షీట్ ఏర్పాటు చేసేందుకు మంత్రి ప్రతిభ పూనారు. మంత్రి ఆదేశాల మేరకు మునిసిపల్ యంత్రాంగం పనులు ప్రారంభించారు. పట్టణంలో క్లాక్‌టవర్ సెంటర్, భాస్కర్ టాకీస్ సెంటర్, బస్టాండ్ ఏరియా, ఎన్‌జీ కాలేజీ, సాగర్ రోడ్డు వంటి ప్రాంత్రాల్లో 5సిగ్నల్స్ పాయింట్లు ఉన్నాయి. అయితే మండుటెండల్లో వాహనాలపై వచ్చి సిగ్నల్స్ వద్ద 30 సెకన్ల పాటు వాహనాలు ఆగుతుండటంతో ఆయా వాహనాదారులు ఎండ వేడిమి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా మరికొంత మంది వడదెబ్బకు గురవుతున్న ప్రమాదాన్ని పసిగట్టిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పట్టణంలో సిగ్నల్స్ వద్ద తాత్కాలిక చలువ పందిళ్ల (గ్రీన్ మ్యాట్) వేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

పైలెట్ ప్రాజెక్టు కింద ఎన్‌జీ కాలేజీ సెంటర్

మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ అధికారులను సమన్వయం చేసుకుంటూ పైలెట్ ప్రాజెక్టు కింద ఎన్‌జీ కాలేజీ వద్ద తాత్కాలిక చలువ పందిళ్లు వేయించారు. ఈ రెండు మూడు రోజుల్లో ఇదే సెంటర్లో మరో తాత్కాలిక చలువ పందిళ్లు వేయనున్నారు. ఈ సెంటర్లో వేసిన పందిళ్లతో టూ-వీలర్, భారీ వాహనాలకు ఎలాంటి ఎదురుకాకపోతే మిగిలిన సెంటర్లో కూడా ఈ చలువ పందిళ్ల ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో పందిరికి రూ.5 లక్షలు చొప్పున ఖర్చు వస్తుందని అధికారులు అంచనా వేశారు. అయినా కూడా వాహనాదారులకు ఎ లాంటి ఇబ్బందులు ఎదురుకాకపోతే మిగిలిన సెంటర్లో కూడా ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని మునిసిపల్ అధికారులు పేర్కొంటున్నారు.



గ్రీన్‌మ్యాట్ కింద వాహనదారులు

ప్రమాదాలు జరగకుండా ఏర్పాట్లు చేయాలి



వాహనదారులకు కాసేపు నీడ కల్పించాలన్న ఉద్దేశంతో గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయడం అభినందనీయం. కానీ గాలి వచ్చిన సమయాల్లో ఈ మ్యాట్ ఎగిరి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అలా జరగకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇక మిగిలిన సెంటర్లో ఏర్పాటు చేస్తే బాగా ఉంటుంది.

- జల్లెల ప్రవీణ్‌కుమార్, చెర్వుగట్టు

నీడ కల్పించడం అభినందనీయం



వేసవిలో రోడ్లపై ప్రయాణించే వాహనదారులకు కాసేపైన నీడ కల్పించాలన్న ఉద్దేశ్యంతో సిగ్నల్స్ పాయింట్ల వద్ద గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయడం అభినందనీయం. గతంలో ఇలాంటి మంచి పనులు ఏ నాయకులు, అధికారులు చేయలేదు. ప్రతిపక్షాలకు కామెంట్ చేయడం తప్ప మంచి పనులు చేయడం తెలియదు.

- ముజ్జు, నల్లగొండ

అన్ని సిగ్నల్స్ వద్ద ఏర్పాటుకు కృషి



పైలట్ ప్రాజెక్టు కింద ఎన్‌జీ కళాశాల వద్ద తాత్కాలిక చలువ పందిరి ఏర్పాటు చేశాం. దీని ఖర్చు రూ. 3 లక్షలకు పైగానే వస్తుంది. ఇక్కడ ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకపోతే పట్టణంలోని మిగిలిన సెంటర్లో కూడా ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

- ముసాబ్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్

రైతులకు ఆహారం పంపిణీ



ఆహారం అందజేస్తున్న రేగట్టె దంపతులు

నల్లగొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27 తేదీన జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు ఎండ్ల బండ్లపై వెళ్తున్న రైతులకు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఆయన సతీమణి రేగట్టె శోభ గురువారం ఆహారం అందజేశారు. సూర్యాపేట నుంచి బయలుదేరిన రైతులకు వరంగల్ జిల్లా వర్ధన్నపేట వద్ద రైతులకు ఆహారం ప్యాకెట్లు, మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభా స్థలికి చేరుకునే వరకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కేసీఆర్ సభలో పాల్గొనేందుకు రైతులు అధిక సంఖ్యలో తరలివెళ్లడం ఎంతో సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. ఉందన్నారు.

కాంగ్రెస్ ఇన్‌-చార్జిని కలిసిన మల్లేష్‌గౌడ్



కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో మల్లేష్ గౌడ్

నల్లగొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి నల్లగొండ మాజీ అధ్యక్షుడు సుంకరి మల్లేష్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మీనాక్షి నటరాజన్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు.

ఐకేపీ సెంటర్లలో అక్రమాలను అరికట్టాలి



ఈదులూరు సెంటర్‌లో తహసీల్దార్‌తో వాదిస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

కట్టంగూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరు మండలంలోని ఈదులూరు, పందెనపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు గజ్జి రవి డిమాండ్ చేశారు. మండలంలోని ఈదులూరు, పందెనపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. క్వింటాకు 3 కేజీల చొప్పున ధాన్యాన్ని అదనంగా తీసుకుంటున్నారని ఆరోపిస్తూ స్థానిక రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. పండించిన ధాన్యాన్ని కొనుగోలు సెంటర్‌కు తీసుకువస్తే ఐకేపీ సెంటర్‌లో పనిచేసే మహిళా సంఘాల అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాధవరెడ్డి, తిరుమలేష్, దాసరి రాములు, గజ్జి నాగరాజు, సింహాద్రి, శంకర్, ఎల్లయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

శాలిగౌరారం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్ని రకాల వసతులు ఉంటాయని మనిమద్దె జడ్పీ హైస్కూల్ హెచ్ఎం ముషం శ్రీనివాసులు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని మనిమద్దె, నూలగడ్డ కొత్తపల్లి గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటా ప్రభుత్వ పాఠశాలల యొక్క ప్రాముఖ్యాన్ని తల్లిదండ్రులకు హెచ్ఎం శ్రీనివాసులు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను బోధిస్తారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలన్నారు. అనంతరం మనిమద్దె హైస్కూల్‌లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రమా శ్రీశైలం, ఉపాధ్యాయులు సహజ, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నల్లగొండటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా ఆరాధన ఉత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని మణికొండకు చెందిన శ్రీ శారద సేవా ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలోని పానగల్ బైపాస్ రోడ్డులో గల లెప్రసీకాలనీ వాసులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ పి.శారద మాట్లాడుతూ తమ ట్రస్టు ఆధ్వర్యంలో లెప్రసీ కుటుంబాలకు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు చలసాని శ్రీలక్ష్మి, పర్మిల, గోపినాథ్, ఉపేంద్ర, వంశీ, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

చండూరురూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఆధ్మాత్మిక చింతనతో మానసిక ప్రాశాంతత లభిస్తుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని దోనిపాముల గ్రామంలో బంగారుమైసమ్మ దేవత ఆలయ సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆయన గురువారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండేలా చూడాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు, సీనియర్ నాయకుడు బొబ్బల మురళిమనోహర్ రెడ్డి, నాయకులు పిన్నింటి నరేందర్‌రెడ్డి, అన్నెపర్తి యాదగిరి, ఆలయ కమిటీ చైర్మన్ నారాయణ, శ్రీను, వెంకన్న, యాదగిరి, శంకర్, ఉపేందర్ పాల్గొన్నారు.

ఇంటర్‌లో మైనార్టీ బాలికల ప్రతిభ

నకిరేకల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో నకిరేకల్ మైనార్టీ జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ సాధించారు. ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో 500 మార్కులకు సానియామీర్జా 475, హిమబిందు 474, శహనాజ్ 469, హారిక 453, రుతి 437 చొప్పున మార్కులు సాధించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ షాహిన్‌అస్మా తెలిపారు. నాలుగేళ్ల నుంచి తమ కళాశాలకు చెందిన విద్యార్థినులు ర్యాంకులు సాధిస్తున్నారని ఆమె తెలిపారు.

ప్రతిష్ఠాత్మకంగా సన్నబియ్యం పంపిణీ

- ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాలరూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రేషన్‌దుకాణాల ద్వారా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సన్నబియ్యం పంపిణీ చేస్తోందని, సన్నబియ్యం పంపిణీకి రూ.10వేల కోట్ల ఖర్చును భరించి పేదలకు ప్రభుత్వం సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో బుధవారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. రేషన్‌దుకాణాల్లో ఇచ్చే దొడ్డురకం బియ్యాన్ని ప్రజలు తినకుండా మార్కెట్‌లో విక్రయిస్తున్నారే ఉద్దేశంతో వాటికి బదులుగా ఎంత ఖర్చునైనా భరించి సన్నబియ్యాన్ని అందించాలనే సంకల్పతో ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుందని అన్నారు. పేద, ధనిక అనే తేడా లేకుండా అందరూ సన్నబియ్యం తినాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, సామాన్య ప్రజల ఆర్థిక స్థితిగతులను అర్థం చేసుకున్న ప్రభుత్వం వారి ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. పేదల కడుపు నింపడమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు డీలర్ గుజ్జరి చంద్రకళయాదగిరి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశంలు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, తహసీల్దార్ కృష్ణానాయక్, ఎంపీడీవో ఎస్‌పీ జయలక్ష్మి, ఎంపీవో సత్యనారాయణ, కార్యదర్శి కంచర్ల గౌతమ్‌రెడ్డి, ఏఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, కాటం వెంకటేశం, గుడిపాటి లక్ష్మీనర్సింహ, నీలకంఠం లింగస్వామి, రాజ్‌కుమార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలి



నెల్లిబండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సీపీఎం నాయకులు

నకిరేకల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు యానాల కృష్ణారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి రాచకొండ వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని నెల్లిబండ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సీపీఎం నాయకులు సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటాలు పెట్టి తరలించాలన్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ఎలాంటి షరతులు లేకుండా, రైతులను ఇబ్బందులు పెట్టకుండా కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వంటెపాక వెంకటేశ్వర్లు, బచ్చుపల్లి ప్రకాష్‌రావు, గింజల లక్ష్మి, యానాల వెంకటరంగారెడ్డి, వంటెపాక కృష్ణ, ఏర్పుల తాజేశ్వర్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

రైతుల మేలు కోసమే 'భూభారతి'

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యం, చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి

చండూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. చండూరులో గురువారం భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భూ సమస్యలు పరిష్కరించేందుకు అధికారులే ప్రజల వద్దకు వస్తారని, భూములున్న రైతులు తమ భూమి భద్రంగా ఉందని తమ గుండెపై చేయి చేసుకుని నిద్ర పోవాలన్న లక్ష్యంతో భూభారతి చట్టాన్ని ప్రభుత్వం రూపొందించిందని గుర్తు చేశారు. ప్రతీ మండలానికి ఒక సర్వేయర్‌ను నియమించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణిని ప్రారంభించడంతో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. క్షేత్రస్థాయిలో భూములు ఉన్నవారికి పట్టాలు ఇవ్వడం, ఆన్‌లైన్‌లో నమోదు వంటివి పూర్తి చేసి సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. శివన్నగూడెం ప్రాజెక్టు రిజర్వాయర్ ఉన్నా గత ప్రభుత్వం డీపీఆర్ చేపట్టలేదని, ప్రసుత్త ప్రభుత్వం రూ. 18 కోట్లతో ఏడుళ్ల నుంచి నీళ్లు తెచ్చే కార్యక్రమం చేపట్టిందన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆయా మండలాల్లో భూముల వివరాలన్నింటినీ నోటీసు బోర్డులో ప్రదర్శిస్తామని వెల్లడించారు. నూటికి నూరు శాతం రైతులకు మేలు చేకూర్చే భూ భారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ దశరథ, మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడిలో అమరులకు నివాళి



నల్లగొండలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కాశ్మీర్‌లోని పహాల్గాం ప్రాంతంలో ఇటీవల పర్యాటకులపై చేసిన ఉగ్రదాడిలో మృతి చెందిన భారతపౌరులకు బుధవారం వివిధ పార్టీలు, సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. కేంద్రప్రభుత్వం శాంతి భద్రతలపై పూర్తి నిర్లక్ష్యం చూపుతోందన్నారు. ఈ కారణంవల్లే పర్యాటకులపై దాడులు జరిగినట్లు తెలిపారు. గురువారం ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకులకు ఘనంగా నివాళులర్పించారు.

కట్టంగూరులో బీజేపీ నాయకులు నివాళులర్పిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోలి ప్రభాకర్, పబ్బు వెంకటేశ్వర్లు, కోమటి భాస్కర్, చెరుకు నాగరాజు పాదూరి వెంకట్ రెడ్డి, రాజు, గోపి, లక్ష్మి, శంకర్, జలేందర్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల మండలం వెలిమినేడులో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో గోలి అరవింద్, అరూరి శివ, పంది భాస్కర్, మహేష్ ప్రశాంత్, చీమల సతీష్, శివప్రసాద్, వెంకటేష్, మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడులో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండా శ్రీశైలం, పార్టీ మండల కార్యదర్శి సాగర్ల లింగస్వామి, సీఐటీయూ మునుగోడు, చండూరు మండల కన్వీనర్లు వరికుప్పల ముత్యాలు, జేరిపోతుల ధనుంజయ్, వడ్లమూడి హనుమయ్య, యసరాణి శ్రీను, భరత్, కొంక రాజయ్య, రాజు పాల్గొన్నారు.

నల్లగొండరూరల్: పర్యాటకులపై దాడులకు పాల్పడటం పిరికి చర్య అని తెలంగాణ రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ అన్నారు. నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో పెహల్గాం ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో అసువులు బాసిన అమరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ గురువారం కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో నాగిళ్ల మురళి, శ్రీనివాస్‌రావు, నరసింహచారి, విజయ్‌కృష్ణ, జిల్లా జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌గా నారాయణ అమిత్



బాధ్యతలు స్వీకరిస్తున్న నారాయణ అమిత్

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ నెల రోజుల పాటు సెలవులో వెళ్లడంతో రెవెన్యూ అదనపు కలెక్టర్ పూర్తి అదనపు బాధ్యతలను మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్‌కు అప్పగిస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు.

మార్పునకు నాంది పలికిన పూలే, అంబేడ్కర్



జనజాతర కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మంద నగేష్, శేఖర్

నల్లగొండరూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): దేశంలోని సామాజిక మార్పునకు నాంది పలికిన మహనీయులు మహాత్మా జ్యోతిబాపూలే, డాక్టర్ అంబేడ్కర్‌లని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మంద నగేష్, ఉపాధ్యక్షుడు పి.శేఖర్ పిలుపునిచ్చారు. నల్లగొండ పట్టణంలోని పెద్ద గడియారం సెంటర్‌లో గురువారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఈ నెల 28వ తేదీన నిర్వహించే పూలే, అంబేడ్కర్ జన జాతర కార్యక్రమ కరపత్రాన్ని వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, సీనియర్ న్యాయవాదులు అనంతుల శంకరయ్య, దర్శనం నర్సింహ, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. రైల్వేస్టేషన్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది జి.వెంకటేశ్వర్లు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, తంతేనపల్లి కృష్ణ, కొమురయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జనజాతరను జయప్రదం చేయాలి

కట్టంగూరు: కులవివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన నల్లగొండలో నిర్వహించే పూలే, అంబేడ్కర్ జనజాతరను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వట్టెపాక కృష్ణ పిలుపునిచ్చారు. కట్టంగూరులోని అమరవీరుల స్మారక భవనంలో గురువారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జనజాతర కరపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కట్ట బక్కయ్య, చిలుముల రామస్వామి, రమేష్, కిరణ్, ఎల్లయ్య, మధు, సుధాకర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు మఖానా సాగు చేపట్టాలి



కనగల్ గ్రామ సమీపంలో మఖానా విత్తనాలు చల్లుతున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

ఆర్డీవో అశోక్‌రెడ్డి

కనగల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ఉండి, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి ఇచ్చే మఖానా పంటను రైతులు సాగుచేసి ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆర్డీవో అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం కనగల్ గ్రామ సమీపంలోని కుంభం నర్సిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన నారుమడిలో మఖానా సీడ్‌ను అధికారులతో కలిసి చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మఖానా పంటకు చీడపీడల బెడద తక్కువని, రసాయన ఎరువుల వాడకం ఉండదన్నారు. వేపనూనె పిచికారీ చేస్తే సరిపోతుందన్నారు. మఖానాలో అన్ని పోషక విలువలు సమృద్ధిగా ఉండటంతో దీన్ని సూపర్‌ఫుడ్‌గా పేర్కొంటారని వివరించారు. ఎకరాకు పెట్టుబడి కింద రూ.60 నుంచి రూ.80వేల వరకు ఖర్చు వస్తుందన్నారు. 30 నుంచి 34 క్వింటాళ్ల పంట దిగుబడి వస్తుందని, రైతులకు అన్ని ఖర్చులుపోగా రూ.2లక్షల నుంచి రూ.2.50లక్షల ఆదాయం లభిస్తుందన్నారు. పంట సాగు కాలం 8 నెలలు ఉండగా రసాయన ఎరువులు వాడకం లేనందున పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు.

కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు ఈ పంట సాగుపై అధికారుల బృందం ఇటీవల బీహార్ రాష్ట్రానికి వెళ్లి పరిశీలన చేసి వచ్చారని వివరించారు. జిల్లా వాతావరణ పరిస్థితులు మఖానా సాగుకు సరిపోతుందని గుర్తించినట్లు తెలిపారు. రైతులు పంటల మార్పిడి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి అనంతరెడ్డి, ఏవోలు అమరేందర్‌గౌడ్, శ్రీనివాస్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	240	270
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.155	215	240

ఉష్ణోగ్రత గరిష్ఠం 41.0 । కనిష్ఠం 25.4

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం

- యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రం
- సమీపంలోనే బస్వాపూర్ రిజర్వాయర్
- సామాజిక ఉద్యమానికి నాంది పలికిన భూదాన్‌పోచంపల్లి
- సెలవుల్లో వినోదంతోపాటు విజ్ఞానాన్ని అందిస్తున్న ప్రాంతాలు



భూదాన్‌పోచంపల్లిలో ఆకట్టుకుంటున్న పచ్చనిపైర్లు

నృసింహ క్షేత్రం

ప్రపంచ ఆధ్యాత్మిక క్షేత్రం.. ప్రపంచ పర్యాటక ప్రాంతం.. జైనులు కొలువుదీరిన నెలవు.. ఆసియా ఖండంలోనే మొట్టమొదటి ఏకశిలా ఖిల్లా.. ఇవన్నీ కలగలిపితే యాదాద్రి భువనగిరి జిల్లా. ప్రపంచ పటంలో ఇంత గొప్ప చరిత్రగల జిల్లాను సందర్శించేందుకు దేశంలోని వివిధ రాష్ట్రాల పర్యాటకులతోపాటు ప్రపంచ పర్యాటకులు సైతం ఆసక్తి చూపుతుంటారు. వేసవి సెలవులు రావడంతో పర్యాటకుల సందడి పెరుగుతోంది. దీంతో జిల్లా టూరిస్ట్ హబ్‌గా మారింది. (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

4

ఎండ నుంచి ఉపశమనం



భానుడి ప్రతాపం రోజురోజుకూ పెరిగిపోతోంది. వేడిగాలులకు తోడు ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇక వాహనదారుల పరిస్థితి వర్ణనాతీతం. రోడ్డువెంట వెలుతుంటే నిప్పుల కొలిమినుంచి వెళుతున్న భావన కలుగుతోంది. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మునిసిపాలిటీ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాకేంద్రంలోని ఎన్జీ కళాశాల వద్ద షేడ్‌నెట్ ఏర్పాటు చేశారు. (ఆంధ్రజ్యోతి-రామగిరి)

ఉమ్మడి జిల్లా గురువారం ఉష్ణోగ్రతలు గరిష్ఠం

దామరచర్ల మండలం	
తిమ్మాపూర్	44.9
వేములపల్లి మండలం	
బుగ్గబావిగూడ	44.7
త్రిపురారం మండలం	
మాటూరు	44.6
మాడ్గులపల్లి	44.5
అనుముల	44.4
కట్టంగూరు	44.0
చిట్యాల	44.0
మిర్యాలగూడ	44.0
తిప్పర్తి మండలం	
పజ్జూరు	43.7
కేతేపల్లి	43.6
చండూరు	43.6
తిరుమలగిరి(సాగర్)	43.4
దామరచర్ల	43.2
తుంగతుర్తి	43.2
సంస్థాన్‌నారాయణపురం	42.8
గుండాల	42.6
రామన్నపేట	42.5
తుంగతుర్తి	43.2



పంటల బీమాకు

సన్నాహాలు

- ప్రతిపాదనలు రూపొందించాలని ప్రభుత్వం ఆదేశం
- వరి, పత్తి పంటలకే బీమాపై నివేదిక ఇచ్చే అవకాశం
- త్వరలో విధివిధానాలు ఖరారయ్యే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో 21.50లక్షల ఎకరాల్లో పంటల సాగు

నల్లగొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పంటల ఉచిత బీమా పథకం అమలుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏ పంటలకు బీమా వర్తింపజేయాలో నివేదిక ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

గత వానాకాలం సీజన్ నుంచే పంటల బీమా పథకం అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా, యాసంగి సీజన్ ముగిసినా ఈ పథకం అమలుకు నోచుకోలేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వచ్చే వానాకాలం నుంచి పంటల ఉచిత బీమా పథకం అమలు చేసేందుకు నిర్ణయించింది. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పీఎంఎఫ్‌బీవై పథకంలో చేరడంతో పాటు పంటల బీమా కోసం రైతుల వాటా ప్రీమియం కూడా చెల్లించేందుకు నిర్ణయించింది. అందుకు విధివిధానాలు రూపొందించాలని మిగతా 5వ పేజీలో...

బీమాకు ఎకరం యూనిట్‌గా తీసుకోవాలి • 5లో..

సిమెంట్, ఐరన్

ధరలు పైపైకి



- సిమెంట్ బస్తాపై నెల రోజుల్లో రూ.70 వరకు పెరుగుదల
- మే చివర నాటికి మరో రూ.20 పెరిగే అవకాశం
- అదే బాటలో ఐరన్
- నెల రోజుల్లో టన్నుకు రూ.6వేలు పెరిగిన ధర
- నిర్మాణదారులపై అదనపు భారం రూ.14.40కోట్లు

సొంతింటి కల నెరవేర్చుకోవాలని ప్రతీ ఒక్కరికి ఆశ ఉంటుంది. ఆ కల నెరవేర్చుకునేందుకు అహర్నిశలూ కష్టపడుతుంటారు. కొంత పొదుపు చేసి, మరికొంత బ్యాంకు నుంచి రుణం తీసుకుని ఆ కలను నెరవేర్చుకుంటారు. కాలంతోపాటు వ్యక్తి ఆలోచనలో మార్పు, ప్రపంచీకరణ నేపథ్యంలో పెరుగుతున్న ఆదాయంతో కొత్త ఇంటి నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే పెరుగుతున్న సిమెంట్, ఐరన్ ధరలు వారి ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి. ధరల కారణంగా సొంతింటి కల సాకారమయ్యే పరిస్థితులు కనిపించడం లేదని గృహ నిర్మాణదారులు వాపోతున్నారు.

● ఆంధ్రజ్యోతి, కోదాడ

నెలరోజుల వ్యవధిలో అన్ని కంపెనీల సిమెంట్ ధరలు రూ.50 నుంచి రూ.70 వరకు పెరిగాయి. వచ్చే నెల చివరి నాటికి మరో రూ.20 పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. మార్చి నెలలో బ్రాండెడ్ కంపెనీ సిమెంట్ ధర బస్తా రూ.277 ఉండగా, ఈ నెల మొదటి వారం వచ్చే సరికి రూ.327కి పెరిగింది. ఈ నెల 23న రాత్రి మరో రూ.10 పెరిగి రూ.337కి చేరింది. ఈ నెలలో ఒక్కో బస్తాపై రూ.50 మేర ధర పెరిగింది. మే



చివర నాటికి బస్తా ధర మరో రూ.20 పెరిగి రూ.357కి చేరుతుందని వ్యాపారులు చెబుతున్నారు. చిన్న కంపెనీల సిమెంట్ ధర సైతం బస్తా రూ.50 మేర పెరిగింది. ఐరన్ నెల క్రితం టన్ను ధర రూ.55వేలు ఉండగా, ప్రస్తుతం రూ.60వేలకు పెరిగింది. టన్నుకు రూ.5వేల మేర ధర పెరిగింది. వీటితోపాటు కలర్స్, ఇతర సామ గ్రి ధరలు కూడా పెరిగాయి. రెండు నెలల క్రితం వరకు స్క్వేర్ ఫీట్ నిర్మాణానికి రూ.1,700 వ్య యం కాగా, నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో రూ.2,000కు ఖర్చు పెరిగిందని మేస్త్రీలు చెబుతున్నారు. ఒక్కో స్క్వేర్‌ఫీట్‌పై రూ.300 అదనపు భారం పడుతోంది. 200 గజాల్లో డబుల్‌బెడ్‌రూం ఇంటి నిర్మాణానికి 800 బస్తాల సిమెంట్ వినియోగం అవుతుంది. సిమెంట్ బస్తా ధర రూ.60 పెరగడంతో రూ.48,000 అదనపు భారం పడుతోంది. అదే విధంగా నాలుగు టన్నుల ఐరన్ వినియోగం అవుతుండగా, టన్ను ధర రూ.5,000 పెరగడంతో, మరో రూ. 20,000 అదనపు భారం పడుతోంది. రెండింటిపైనే రూ.68,000 అదనపు వ్యయం అవుతోంది. మే నాటికి ధరల పెరుగుదల భారం రూ.లక్ష వరకు ఉంటుందని అంచనా. ఈ క్రమంలో కొత్త ఇంటి నిర్మాణం కలే అని గృహ నిర్మాణదారులు వాపోతున్నారు. ఇదిలా ఉంటే గత ఏడాది సిమెంట్ పరిశ్రమలకు ఆశాజనంగా లేకపోగా, ప్రస్తుతం ధరల పెరుగుదలతో వాటికి ఆదాయం పెరగనుంది.

రూ.14.40కోట్ల అదనపు భారం

ఉమ్మడి జిల్లాలో చిన్న, పెద్ద సిమెంట్ కంపెనీలు సుమారు 26 వరకు ఉన్నాయి. వాటి ద్వారా నెలకు సుమారు మిగతా 4వ పేజీలో...

'భూభారతి'తో సమస్యల పరిష్కారం : కలెక్టర్

నాంపల్లి, గట్టుప్పల్, మునుగోడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భూ భారతితో రైతుల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం నాంపల్లి, గట్టుప్పల్, మునుగోడు మండల కేంద్రాల్లో నిర్వహించిన 'భూభారతి' అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ధరణిలో గుర్తించిన లోపాలన్నింటినీ భూభారతి ద్వారా సరిచేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. జూన్ 2 నుంచి భూ ఈ చట్టం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. రైతులు భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అందుకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ధరణిలో వీఆర్వో వ్యవస్థను తీసివేయడంతో ఇబ్బందులు ఏర్పడగా, రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రతీ గ్రామానికి ఒక గ్రామ పాలనాధికారిని నియమించనున్నదని తెలిపారు. జిల్లాలో 33 మండలాలకు 12మంది సర్వేయర్లు మాత్రమే ఉన్నారని, ఈ సమస్యను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వమే లైసెన్స్ సర్వేయర్లను నియమించనుందని తెలిపారు. సాదా బైనామా, ఇతర సమస్యలు పరిష్కరించేందుకు గతంలో సీసీఎల్ఏకు అవకాశం ఉండేదని, భూభారతిలో ఆర్డీవోకు అవకాశం కల్పించారన్నారు. అలాగే తప్పులు సరిచేసే అవకాశం 90 శాతం తహసీల్దార్ స్థాయిలో ఉంటుందన్నారు. రైతులకు రుణాలు అవసరమైతే బ్యాంకులో భూమి కాగితాలు, ఇతర డాక్యుమెంట్లు సమర్పించాల్సిన అవసరం లేదని, భూభారతి పోర్టల్ వివరాల ఆధారంగా రుణం ఇస్తాయన్నారు. రైతుల భూములను సర్వే చేయించి హద్దులు నిర్ణయించి మ్యాప్‌తో సహా రిజిస్ట్రేషన్ సమయంలో ఇస్తామన్నారు. దీంతో భూ కబ్జాలకు అవకాశం ఉండదన్నారు. ప్రతీ పౌరుడికి ఆధార్‌కార్డు ఉన్నట్లు రైతులకు భూదార్‌కార్డు ఇస్తామన్నారు. భూముల వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చన్నారు. కొత్త చట్టంలో అనుభవదారుడికి హక్కు కల్పించే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్సీ నెల్లకంటి సత్యం మాట్లాడుతూ, భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తెచ్చిన భూభారతి చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో అధిక భాగం ఫ్లోరైడ్ పీడిత ప్రభావిత ప్రాంతంగా పేరున్న మునుగోడు ప్రాంతంలో ప్రజలకు అన్నిరకాలుగా జీవనధారమైన వాగులు అక్రమణలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. నాంపల్లి మండలానికి ఒక ఆర్ఐను నియమిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివా‌స్‌రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, ఫ్లోరోసిస్ ఉద్యమ నేత కంచకుంట్ల సుభాష్, మండల ప్రత్యేక అధికారులు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, బీరప్ప, తహసీల్దార్లు దేవా సింగ్, కే.రాములు, నరేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణయాదవ్, ఎంపీడీవోలు రామకృష్ణశర్మ, జూలకంటి మాధవరెడ్డి, శాంతికుమారి, మండల వైద్యాధికారి డాక్టర్ భవాని, ఏవో శివ, నాయబ్ తహసీల్దార్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.



గట్టుప్పల్‌లో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మూడు గంటల ఉక్కపోత.. రోగుల అవస్థలు

జిల్లా కేంద్రాస్పత్రిలో నిలిచిన విద్యుత్ సరఫరా ● మొరాయించిన జనరేటర్

నల్లగొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ఆస్పత్రిలో గురువారం రాత్రి అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయి మూడు గంటల పాటు ఆస్పత్రిలోని రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదే సమయంలో జనరేటర్ సైతం మొరాయించటంతో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగింది. మరమ్మతు అనంతరం జనరేటర్ పనిచేసినా ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో ఫ్యాన్లు, లైట్లు పనిచేయలేదు. గురువారం రాత్రి ఏడు గంటల నుంచి 10 గంటల వరకు ఆసుపత్రి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌లో ట్రిప్ అవడంతో విద్యుత్ అంతరాయం అయినట్లు తెలిసింది. దీంతో వివిధ విభాగాల్లో విద్యుత్ సరఫరా కాక సమస్యలు ఎదురయ్యాయి. గతంలో సైతం పలుమార్లు విద్యుత్ సరఫరా కాక ఇలాంటి పరిస్థితులు ఏర్పడినా ఆసుపత్రి అధికారులు నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. అత్యవసర సర్వీసుల్లో భాగంగా ఒక్కోసారి శస్త్రచికిత్సలు చేయాల్సి ఉంటుంది. గురువారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఆక్సిజన్ సరఫరాకు కూడా సమస్యలు ఎదురయ్యాయని సమాచారం. ఈ ఆస్పత్రి ప్రాంగణంలోనే ప్రసూతి విభాగం ఉంది. నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి జిల్లా నలుమూలల నుంచి, కొన్నిసార్లు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అత్యవసర వైద్య సేవల కోసం వివిధ సమస్యలతో నల్లగొండలోని ప్రభుత్వ ఆసుపత్రికి వస్తుంటారు. ఇంత పెద్ద ఆస్పత్రికి తరచుగా విద్యుత్ సరఫరా కాకుండా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. గురువారం నల్లగొండ జిల్లాలో 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఎండలకు, ఉక్కపోతకు తోడు రాత్రి సమయంలో కరెంటు సరఫరా నిలిచిపోవడంతో ఫ్యాన్లు పనిచేయక రోగులతో పాటు, వారి బంధువులు సైతం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బర్నింగ్ వార్డులతోపాటు, చిన్నారులు కరెంటు సరఫరా లేకపోవడంతో సతమతమయ్యారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయి రోగులు అవస్థలు పడిన అంశంపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా అధికారులు అందుబాటులోకి రాలేదు.



జిల్లా కేంద్రంలోని కేంద్రాసుపత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సెల్ ఫోన్ లైట్లతో తిరుగుతున్న రోగులు

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్ కేసులు లేకుండా త్వరితగతిన పరిష్కరించి కేసుల సంఖ్యను తగ్గించాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ అధికారులతో నిర్వహించిన నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకొని పూర్తి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ దాఖలు వరకు జాగ్రత్తగా పరిశోధన చేయాలన్నారు. పోక్సో కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ మౌనిక, అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీ శివరాంరెడ్డి, రాజశేఖర్‌రాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

కానిస్టేబుళ్లకు పదోన్నతి

ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో పనిచేస్తున్న ఏడుగురు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో వారికి పట్టీలు అందజేసి ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, అడ్మిన్ ఆర్ఐ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మోరు తల్లిగా రేణుకా ఎల్లమ్మ

కనగల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దర్వేశిపురం శ్రీరేణుకా ఎల్లమ్మ గురువారం అమ్మోరు తల్లిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి వేప, మామిడి ఆకులతో విశేష అలంకరణ చేసి సహస్రనామాలతో కుంకుమ పూజలు నిర్వహించారు. పంచనాగ, సింహ హారతులిచ్చారు. ప్రత్యేక పూజలు అర్చకుడు మాల్లాచారి ఆధ్వర్యంలో కొనసాగాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. కుంకుమ అభిషేక పూజలు చేయించి చీర సారె, ఒడిబియ్యం బోనాన్ని నైవేద్యంగా సమర్పించారు.



కార్మికుల హక్కులు కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

నిడమనూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులు కాలరాస్తోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సీఐటీయూ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మే 20న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కొమాండ్ల గుర్వయ్య, బొడ్డు లింగయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

హాలియా, ఏప్రిల్ 24, (ఆంధ్రజ్యోతి): హాలియా మునిసిపల్ పరిధిలోని అనుముల 7వ వార్డులో 50 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఏడీ తిరుపతయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.అలాగే ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి సూచన మేరకు లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి రూ. 9.14 లక్షల నిధులతో అనుముల మండలంలో ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త స్తంభాలు ఏర్పాటు చేయనన్నట్లుపేర్కొన్నారు.

కంకర తేలి..గుంతలు పడి

- చింతపల్లి మండలంలో అధ్వానంగా సీసీ రహదారులు
- మూడేళ్ల క్రితమే నిర్మాణం
- పర్యవేక్షణ లేకపోవడం, నాణ్యత పాటించకపోవడమే కారణం

గత ప్రభుత్వ హయాంలో చింతపల్లి మండలంలో నిర్మించిన సీసీ రహదారులు మూడేళ్లకే కంకర తేలి, పగుళ్లు ఏర్పడుతున్నాయి. కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేపట్టడంతో సంబంధిత శాఖ అధికారులు నాణ్యతా ప్రమాణాలు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపణలు వస్తున్నాయి. (ఆంధ్రజ్యోతి-చింతపల్లి)



వేంకటేశ్వరనగర్‌లో కంకరతేలిన సీసీ రోడ్డు

మండలంలో 34 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అందులో కొన్ని గ్రామాల్లో 2022 సంవత్సరంలో సీసీ రోడ్ల నిర్మాణానికి గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.50 లక్షలు నిధులు మంజూరయ్యాయి. దీంతో ప్రజాప్రతినిధులు, పలుకుబడి కలిగిన నాయకులు కాంట్రాక్టర్లుగా మారిపోయారు. వారి ఆధిపత్యానికి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాసిరకంగా రోడ్లు నిర్మించారు. పదేళ్ల పాటు పదిలంగా ఉండాల్సినవి పనికిరాకుండా మారాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఏఏ గ్రామాల్లో అంటే..

- వీ.టీ నగర్‌లో సిమెంట్ రోడ్డు నాసిరకంగా నిర్మించడంతో పూర్తిగా ధ్వంసమైయింది.
- వెంకటంపేటలో రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయకపోవడంతో వాహనాల రాకపోకలతో రోడ్డు దెబ్బతింటోంది.
- మదనాపురంలో ప్రభుత్వ పాఠశాల సమీపంలో రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి.
- నెల్వలపల్లిలో ట్రాక్టర్లు వెళ్లడంతో రోడ్డు పూర్తిగా కుంగిపోయింది.
- గొల్లపల్లిలో రోడ్ల ధ్వంసం కావడంతో స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.
- చింతపల్లి, నసర్లపల్లి, ఘడియాగౌరారం, మల్లారెడ్డిపల్లి, కుర్మేడ్‌లో రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయకపోవడంతో శిథిలావస్థకు చేరాయి.

పనులు చేపట్టాల్సింది ఇలా..

సీసీ రహదారులు నిర్మించే సమయంలో రెండు అడుగుల లోతు మట్టి తవ్వి దానిపై నాణ్యమైన మొరం పోసి నీటితో క్యూరింగ్ చేయాలి. రోలర్‌తో తొక్కించాలి. అడుగుభాగంలో కంకర వేసి నీటిని చల్లుతూ రోలర్‌తో చదును చేయించాలి. ఇసుకను పోసి సిమెంట్ మిశ్రమం భూమిలోకి వెళ్లకుండా పాలిథీన్(ప్లాస్టిక్) కవర్‌ను భూమిపై ఏర్పాటు చేయాలి. నాణ్యమైన ఇసుక, కంకర, సిమెంట్‌తో తయారు చేసిన మిశ్రమం పోసి వైబ్రేటర్‌తో ఒత్తిడి తేవాలి. పనులు పూర్తయిన తర్వాత సిమెంట్ రోడ్డుపై మట్టితో అడ్డుగా కట్టలు కట్టి వరిగడ్డి వేసి సుమారు 25 రోజులు క్యూరింగ్ చేయాలి. ఇందుకు విరుద్ధంగా ఇసుకను వాడటం, నాణ్యత లేని సిమెంట్‌తో సీసీ రహదారుల పనులు పూర్తి చేశారు. సక్రమంగా క్యూరింగ్ చేయకపోవడంతో కొన్నేళ్లకే కంకర తేలి పగుళ్లు వస్తున్నాయి. అలాగే కాంట్రాక్టర్ ఇసుకను అధికంగా వినియోగించడం, క్యూరింగ్ సక్రమంగా చేయకపోవడంతో నాణ్యత లోపం కనిపిస్తోంది. రోడ్డు వేసిన తర్వాత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ నామమాత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

రాత్రిళ్లు ఇబ్బందులు పడుతున్నాం



సీసీ రహదారుల నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపం కారణంగా వేసిన రహదారులు అధ్వానంగా మారాయి. సిమెంట్ కొట్టుకుపోయి కంకరతేలి, గుంతలు పడ్డాయి. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం కారణంగా సమస్య ఏర్పడింది.
-కుంచరావు క్రాంతిరెడ్డి, (ఎం.మల్లేపల్లి)

క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం

2022 సంవత్సరంలో సీసీ రహదారుల పనులు సక్రమంగా నిర్మించలేదు. నిబంధనలకు విరుద్ధంగా సీసీ రోడ్లు నిర్మిస్తే చర్యలు తీసుకుంటాం. నాసిరకంగా ఉన్న సీసీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటాం.
-జీవన్‌సింగ్, డీఈపీఆర్, చింతపల్లి

అద్దె భవనాలు.. అరకొర వసతులు

- కొండమల్లేపల్లిలో ఇబ్బంది పడుతున్న ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది
- తొమ్మిదేళ్లు దాటుతున్నా లేని సొంత భవనాలు

పాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా 2016లో కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో కొండమల్లేపల్లి మండల కేంద్రంతో కలుపుకొని 26 గ్రామపంచాయతీలతో మండలంగా ఏర్పాటు చేశారు. దాదాపు 9 ఏళ్లు గడుస్తున్నా పలు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. దీంతో నిత్యం పనుల కోసం వచ్చే ప్రజలు సరైన సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు.
(ఆంధ్రజ్యోతి- కొండమల్లేపల్లి)



అద్దె భవనంలో తహసీల్దార్ కార్యాలయం

కార్యాలయ తలుపుల దుస్థితి

మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో కార్యాలయాలు తాత్కాలికంగా ఏర్పాటుచేశారు. అయితే అధికారులు, సిబ్బందికి సరిపడా గదులు లేక ఇతర సౌకర్యాలు లేక కొన్ని అద్దె భవనాల్లో మహిళలకు మరుగుదొడ్డి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రికార్డులు భద్రపరిచేదెలా

కొండమల్లేపల్లి మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ నిర్వాహణ ఇబ్బందిగా మారింది. 26 గ్రామపంచాయతీలకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను తహసీల్దార్ కార్యాలయంలో భద్రపర్చడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ భవనంలోని కిటికీలు, అద్దాలు పూర్తిగా ధ్వంసం కావడంతో పాటు భవనం చుట్టూ పిచ్చి మొక్కలు అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీనికి తోడు తహసీల్దార్ కార్యాలయంలో రాత్రి వేళలో ఎలాంటి భద్రత సిబ్బంది లేక పోవడంతో రెండేళ్ల క్రితం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రంలోని కంప్యూటర్ చోరీకి గురైంది. కనీస భద్రత చర్యలు లేకపోవడం, సీసీ కెమెరాలు లేకపోవడం, రాత్రి సమయంలో వాచ్‌మన్‌ను నియమించకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి సొంత భవనం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నాయకులు, మండల ప్రజలు కోరుతున్నారు.

సొంత భవనం ఏర్పాటు చేయాలి



ప్రభుత్వ కార్యాలయానికి పక్కా భవనం లేకపోవడంతో అద్దె భవనంలో అధికారులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. మండలం ఏర్పాటై దాదాపు 9 ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఏ ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. తాత్కాలిక భవనంలోనే కొనసాగుతున్నాయి. కార్యాలయాలు విశాలంగా లేకపోవడంతో కూర్చొవడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉన్నతాధికారులు సొంత భవనం ఏర్పాటు చేయాలి.
-కుంభం యాదగిరిగౌడ్, కొండమల్లేపల్లి

బీఆర్ఎస్ బలోపేతానికి విష్ణు సేవలు మరువలేం

- మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ బలోపేతానికి మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కుర్రావిష్ణు(కోటేశ్వరావు) సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. విష్ణు జయంతి సందర్భంగా గురువారం ప్రభుత్వం ఏరియా ఆసుపత్రిలో రోగులు, గర్భిణులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎండీ ముగ్దూం పాషా, ఇలియాస్ ఖాన్, అయిల వెంకన్న, ఎండీ మాజీద్, పద్మశెట్టి కోటేశ్వరావు, పునాటి లక్ష్మీనారాయణ, సాధినేని శ్రీనివాసరావు, మొండికత్తి లింగయ్య, పిన్న బోయిన శ్రీనివాస్ యాదవ్, తిరందాసు విష్ణు, పందిరి వేణు, భీమ్లానాయక్, వింజం శ్రీధర్, దుర్గాచారి, వాజీద్ తదితరులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ టౌన్ : మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కుర్ర విష్ణు జయంతి సందర్భంగా గ్రంథాలయంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అన్నబీమోజు నాగార్జునాచారి, ఎండీ. షోయబ్, పందిరి వేణు, శ్రీకాంతాచారి, శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల వద్ద వసతులు కల్పించాలి

డిండి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాలు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు వసతులు కల్పించాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.షైనొద్దిన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో రెండు సహకార సంఘాలు ఉండగా డిండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో డిండి, గోనబోయినపల్లి, తవక్లాపూర్ సొసైటీ పరిధిలో తవక్లాపూర్, రామాంతపూర్‌ల్లో ఇప్పటికే కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, టెంట్లు, టార్పలిన్లు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు.. రైతులకు తీవ్రమైన ఎండలకు ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బందులు కలిగిన రైతుసంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

బీఎస్ఎన్ఎల్ సేవలను వినియోగించుకోవాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న బీఎస్ఎన్ఎల్ అధికారులు

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ ఎస్‌డీఈ వెంకటేష్ కోరారు. గురువారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ తక్కువ ఖర్చుతో ఇంటర్నెట్, ఫైబర్ సేవలు అందిస్తుందన్నారు. అలాగే మారుమూల గ్రామాలకు నెట్‌వర్క్‌ను విస్తరిస్తూ సరికొత్త పథకాలు, ఫ్యామిలీ ప్యాక్‌లు అందుబాటులోకి తెచ్చిదన్నారు. 3జీ సిమ్ కలిగిన వినియోగదారులు కార్యాలయంలో లేదా సేవా కేంద్రాల్లో సంప్రదించి 4జీ సిమ్‌ను పొందాలని కోరారు. అనంతరం ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో జేటీవో రవినాయక్, బీఎస్‌వో శ్రీనివాసనాయక్, జేఈఈ సంజీవరెడ్డి, రామయ్య, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ పరామర్శ

మిర్యాలగూడ రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వపల్లి గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబుద్దీన్ గురువారం మృతిచెందారు. ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ షాబుద్దీన్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట పీసీసీ మెంబర్ చిరుమర్రి కృష్ణయ్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, నాయకులు తలకొప్పుల సైదులు, మెరుగు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కుక్కల సురేష్, ఎస్‌కె.హాజీ తదితరులు ఉన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్



నిడమనూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే భగత్

నిడమనూరు, తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి నోముల భగత్ అన్నారు. గురువారం తిరుమలగిరి(సాగర్), నిడమనూరు, మాడ్గులపల్లి బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో వారు మాట్లాడారు. అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. రుణమాఫీ, రైతుభరోసా అమలులో ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. కాంగ్రెస్ పాలనతో విసుగు చెందిన ప్రజలు మళ్లీ కేసీఆర్ వైపు చూస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 27న వరంగల్ ఎల్కతుర్తిలో నిర్వహించే సభకు మాజీ సీఎం కేసీఆర్ హాజరవుతున్నందున మండలం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు తరలి రావాలన్నారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పగిళ్ల సైదులు, తాటిసత్యపాల్, పిడిగం నాగయ్య, మాజీ జడ్పీటీసీ ఆంగోతు సూర్య భాష్యనాయక్, నాయకులు బొల్లం రవి, నల్లబోతు వెంకటేశ్వర్లు, కేశ శంకర్, పిల్లి రమేష్, సత్యనారాయణరెడ్డి, చిలుముల సంతోష్, గుడిసె శంకర్, భాస్కర్ బానావత్ బాబురావునాయక్, కేతావత్ భిక్షానాయక్, శ్రీనివాస్‌రెడ్డి, రమణరాజు పాల్గొన్నారు.

కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులకు పాదపూజ



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

హాలియా, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించడంలో భాగంగా మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొత్తపల్లి జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు దాస వెంకన్న మాట్లాడుతూ విద్యార్థులకు తల్లిదండ్రుల గొప్పతనాన్ని, సమాజంలో పాటించాల్సిన విలువలను, అమ్మనాన్నల కష్టాన్ని, బిడ్డల కోసం అమ్మానాన్నలు పడే ఆరాటం వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం మొదటిసారని, ఇలాంటి కార్యక్రమాల వల్ల సామాజిక విలువలు పునరుద్ధరించబడుతాయన్నారు. నేటి సమాజానికి ఇలాంటివి చాలా అవసరమన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్మల, ఉపాధ్యాయులు మాధవి, దివ్యలక్ష్మి, సరిత పాల్గొన్నారు.

పెహల్గాంలో ఉగ్రవాదుల దాడి హేయం



దేవరకొండ కోర్టులో విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

దేవరకొండ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో పెహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అత్యంత హేయమని, దాడి చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమా మహేశ్వర్, కార్యదర్శి కర్నాటి సురేష్ అన్నారు. ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ గురువారం దేవరకొండ కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు అశోక్, రమేష్, రాములు, శ్రీనివాస్, ముష్తాక్ అహ్మద్, యాదయ్య, జగదీశ్వర్, రవి, పుష్పలత, శ్రీకాంత్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

● పర్యాటకులపై దాడిచేసిన ఉగ్రమూకల భరతం పట్టాలని తెస్సా అధ్యక్షుడు పర్వాపాసు దేవరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉగ్రమూకల దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోవడం, అనేక మందికి గాయాలు కావడం అత్యంత విషాదకరమైన ఘటనగా ఆయన పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ప్రకటన విడుదల చేసినవారిలో ఉడుత సలేశ్వర్‌యాదవ్, ఎండీ.రంజాన్‌బేగ్, బొడ్డు వెంకటరమణ, అడపాల శేఖర్ తదితరులు ఉన్నారు.

● మిర్యాలగూడ టౌన్ : పహల్గాంలో ఉగ్రమూకల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు వినియోగదారుల సంఘం, సీనియర్ సిటిజన్లు మిర్యాలగూడ పార్క్ సమీపంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రదాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘం డివిజన్ కార్యదర్శి చితిరాల సాంబశివరావు, గోళ్ల రంగయ్య, చిల్లంచర్ల వెంకటేశ్వర్లు, తల్లం అశోక్, గరిణె నర్సింహరావు, సోమనాథం, పూర్ణచందర్‌రావు, చంద్రశేఖర్, ఆంజనేయులు, సత్యనారాయణ పాల్గొన్నారు.

● మిర్యాలగూడ : పెహల్గాంలో యాత్రికులను కాల్చి చంపడం అమానుషమని ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అంజద్ అన్నారు. గురువారం ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ ఘటనను ఖండించాలని అన్నారు. ఉగ్రవాదుల దాడులను ఆసరాగా చేసుకుని దేశంలో మత విద్వేషాలను సృష్టించే శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సమావేశంలో ఆయూబ్, కరీమున్నీసా బేగం, సమద్ పాల్గొన్నారు.



మిర్యాలగూడ : సమావేశంలో మాట్లాడుతున్న ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అంజద్

27న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌కు సన్మానం



సమావేశంలో మాట్లాడుతున్న భగవాన్‌నాయక్, గిరిజన సంఘం నాయకులు

హాలియా,ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌కు ఈనెల 27 న ఆదివారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గిరిజన సంఘం నాయకులు ఆంగోతు భగవాన్‌నాయక్ తెలిపారు. హాలియాలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో గురువారం గిరిజనుల సమావేశాన్ని ధనావత్ భాస్కర్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌కు హాలియాలోని లక్ష్మీనర్సింహాగార్డెన్స్‌లో సన్మాన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి గిరిజన సోదరులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ పాండునాయక్, బానోతు సక్రూనాయక్, పాండునాయక్, సర్దార్‌నాయక్, నాగేందర్, వెంకట్‌రాంనాయక్, రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు లేకుండా చూడాలి



కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మాట్లాడుతున్న నర్సింహ

గుర్రంపోడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గుర్రంపోడు మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు జరగకుండా సజావుగా నడిపేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని అఖిల భారత విప్లవ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల నర్సింహ కోరారు. మండలంలోని చామలోనిబావి ధాన్యం కొనుగోలు కేంద్రాన్నిగురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాది గుర్రంపోడు మండలంలో ధాన్యం కొనుగోలులో అక్రమాలు జరిగాయని, ఈ ఏడాది పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సరైన సమయంలో లారీలు రాక రైతులు పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చామలోనిబావి గ్రామంలో సెంటర్ ఇన్‌చార్జి, ఐకేపీ కోఆర్డినేటర్ శేఖర్ ప్రైవేట్‌వ్యక్తిని నియమించుకొని అక్రమాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు జరగకుండా చూడాలని కోరారు. ఆయన వెంట బైరి సత్తయ్య, మంటిపల్లి సత్యనారాయణ, కృష్ణయ్య, లచ్చయ్య, అంజన్‌కుమార్, తదితరులు ఉన్నారు.

నేడు భూభారతిపై అవగాహన సదస్సులు

మిర్యాలగూడ రూరల్, దామరచర్ల, అడవిదేవులపల్లి ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంపై మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి మండలకేంద్రాల్లో శుక్రవారం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్లు హరిబాబు, జవహర్ లాల్, శ్రీనివాస్ గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మిర్యాలగూడలో పట్టణంలోని ఎస్‌వీ గార్డెన్, దామరచర్లలో నిలక్ష్మారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో, అడవిదేవులపల్లి రైతు వేదికల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డులు పూర్తి స్థాయిలో పరిశీలించి భూవివాదాల పరిష్కారానికి అనుకూలంగా రూపొందించిన భూభారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.. ఈ సదస్సుకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ హాజరుకానున్నట్లు వివరించారు రైతులు, అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.